లేఖనములయందు మీకు నిత్యజీవము కలదని తలంచుచు
వాటిని పరిశోధించుచున్నారు. అవే నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి...
యోహాను 5:39

# యెహోవా పండుగలు

## (The Feasts of The Lord)




సహో. ధర్మా మల్లు
M.Min

'యెహోవా పండుగలు' *(The Feasts of The Lord)* అను యీ పుస్తకము నందు పాత నిబంధనలో దేవుడు ఇశ్రాయేలీయులకు నియమించిన ఏడు పండుగ సమయములను గూర్చిన వివరణ యివ్వబడినది.

అంతేగాక, యీ పండుగలు ప్రభువైన యేసుక్రీస్తుకు, ఆయన యందు విశ్వాసముంచువారికి కలుగు ఆశీర్వాదములకు యెలా సూచకప్రాయంగా వున్నాయన్న సత్యము యీ పుస్తకము ద్వారా తెలియజేయబడినది.



**సహో. ధర్మా మల్లు**
**M.Min**

**రచయిత యొక్క యితర రచనలు:**

1) **క్రీస్తు ఉపమానములు - దేవుని రాజ్య మర్మములు**
2) **మోషే ప్రత్యక్షపు గుడారము**

**ప్రతులకు సంప్రదించండి:**

**Grace Ministries**
**D.No. 6-38-20/1, L.V. Nagar, Drivers Colony**
**Gajuwaka, Visakhapatnam - 530 026**
**Tel. # 0891-2511689, 9177747337, 9490885102**
**Email: dmbooks075@gmail.com**

**వెల** Rs. 20/-

# యెహోవా పండుగలు

# *(The Feasts of The Lord)*

**సహో॥ ధర్మామల్లు M.Min**

# YEHOVA PANDUGALU (Telugu)

## (*THE FEASTS OF THE LORD*)

***DHARMA MALLU***

**First Edition Copyright 2014**

**Published by**

**Grace Ministries**

**# 6-38-20, L. V. Nagar**

**Gajuwaka - 530 026**

**Visakhapatnam, India**

**Mobile: 9177747337**

**Designing & type setting**

**Renee Graphics 9030863858**

**Written permission must be obtained from the author at the above address for reprinting or translating any part of this book.**

# కృతజ్ఞతలు

ఈ పుస్తకమును ప్రచురించుటలో సహకరించిన దైవదాసులు సహో॥ డి.యస్.యన్.రాజు గారికి, సహో॥ హనోకు గారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియ జేసుకుంటున్నాను. ప్రచురణకర్తలకు, టైపింగ్‌లో సహాయపడిన సహో॥ సతీష్‌బాబు (రెనీ గ్రాఫిక్స్) గారికి నా వందనములు. అంతేగాక, యీ పుస్తక పంపిణీలో సహాయము చేసిన సహో॥ ఇమ్మానుయేలు గారికి, సహో॥ వర ప్రసాద్ గారికి, సహో॥ ప్రభాకర్ రెడ్డి గారికి, సహో॥ చంద్ర కిరణ్ గారికి నా ప్రత్యేక వందనములు తెలియ జేసుకుంటున్నాను. యీ పుస్తక ప్రచురణ కొరకు ప్రార్థించిన విశ్వాసు లందరికీ నా వందనములు.

సహో॥ ధర్మా మల్లు

Email: dmbooks075@gmail.com

# ఉపోద్ఘాతము

ఏదైనా పండుగ వాతావరణమున్నప్పుడు లోకములో ప్రజలు యెన్నో రీతులుగా తమ సంతోషమును వ్యక్త పరుస్తుంటారు. అయితే దేవుడు తన ప్రజలను నిజమైన సంతోషముతో నింపగలడని దేవుని వాక్యము సెలవిస్తున్నది. 'వారి ధాన్య ద్రాక్షారసములు విస్తరించిన నాటి సంతోషము కంటె అధికమైన సంతోషము నీవు నా హృదయములో పుట్టించితివి' (కీర్తన 4:7). 'నీ సన్నిధిని సంపూర్ణ సంతోషము కలదు, నీ కుడి చేతిలో నిత్య సుఖములు కలవు' (కీర్తన 16:11). అయితే యీ సంతోషము దేవుని కుమారుడైన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా పాప క్షమాపణ పొంది, ఆయనతో సహవాసము కలిగియుండుట ద్వారా మాత్రమే సాధ్యము (యోహాను 15:10-11; 1యోహాను 1:3-4). దీనికి సాదృశ్యంగా ఇశ్రాయేలీయులు ఐగుప్తు బానిసత్వము నుండి విడిపింపబడినపుడు ఆనందించిరి (నిర్గమకాండం 15:1,2). యేసుక్రీస్తును రక్షణ వస్త్రముగా కలిగిన వారు మహానందము పొందుదురు (యెషయా 61:10). వారి దు:ఖము, నిట్టూర్పు తొలగిపోయి, నిత్య సంతోషము తమ తలల మీద కలిగియుందురు (యెషయా 35:10, 51:11). వారు సంతోషించి, ఉల్లసించుదురు మరియు ఆనందగానము చేయుదురు (కీర్తన 32:11, 68:3, 97:12). యేసుక్రీస్తు ద్వారా చెప్పనశక్యమును, మహిమాయుక్తమునైన సంతోషమును పొందుదుము (1పేతురు 1:8-9).

ప్రభువైన యేసుక్రీస్తును, ఆయన ద్వారా విశ్వాసులు పొందు యీ సంతోషమును దర్శిస్తూ, పాత నిబంధనా కాలములో యెహోవా తన ప్రజలకు కొన్ని పండుగ సమయములను నిర్ణయించాడు. అందుకే పాత నిబంధనలో క్రొత్త నిబంధన గుప్తమైయున్నదని, క్రొత్త నిబంధన ద్వారా పాత నిబంధన బయలు పరచబడినదని చెప్పుదురు. యేసుక్రీస్తు యూదులతో, 'లేఖనముల

యందు మీకు నిత్యజీవము కలదని తలంచుచూ వాటిని పరిశోధించుచున్నారు. అవే నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవని' చెప్పాడు (యోహాను 5:39). ఎమ్మాయు గ్రామమునకు వెళుతున్న యిద్దరు మనుష్యులను అవివేకులని, ప్రవక్తలు చెప్పిన మాటలన్నిటిని నమ్మని మందమతులని గద్దించాడు (లూకా 24:25). పాతనిబంధనలో తనను గూర్చి చెప్పబడిన వచనముల భావము వారికి తెలియజెప్పాడు (లూకా 24:27). పాతనిబంధనలో దేవుడు ఇశ్రాయేలీయులకు నిర్ణయించిన పండుగలు ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా ఆయనయందు విశ్వాసముంచు వారికి కలుగు ఆశీర్వాదము గురించి వర్ణిస్తున్నవన్న సత్యమును యీ పుస్తకము ద్వారా గమనించగలము.

ఇశ్రాయేలీయుల పరిశుద్ధ సంవత్సరములోని పండ్రెండు నెలలు వాటి క్రమము ప్రకారము క్రింద యివ్వబడినవి.

1. నిస్సాన్ (మార్చి – ఏప్రిల్)
2. ఇయార్ (ఏప్రిల్ – మే)
3. సివన్ (మే – జూన్)
4. టమ్మూజ్ (జూన్ – జూలై)
5. అవ్ (జూలై – ఆగష్టు)
6. ఎలుల్ (ఆగష్టు – సెప్టెంబర్)
7. టిశ్రె (సెప్టెంబర్ – ఆక్టోబర్)
8. కశ్వాన్ (అక్టోబర్ – నవంబర్)
9. కిస్లెవ్ (నవంబర్ – డిసెంబర్)
10. టెబెత్ (డిసెంబర్ – జనవరి)
11. షెబాత్ ( జనవరి – ఫిబ్రవరి)
12. అదార్ (ఫిబ్రవరి – మార్చి)

లేవీయకాండము 23:4-44 వచనములు మరియు యితర వాక్యభాగములను పరిశీలించిన యెడల దేవుడు ఇశ్రాయేలీయులకు క్రింద యివ్వబడిన యేడు పండుగలను ఆచరించమని ఆజ్ఞాపించినట్లు తెలుసుకొందుము.

1. పస్కా పండుగ
2. పులియని రొట్టెల పండుగ
3. ప్రథమ ఫలముల పండుగ
4. వారముల పండుగ (పెంతెకొస్తు పండుగ)
5. బూరల పండుగ
6. ప్రాయశ్చిత్తార్థ దినము
7. పర్ణశాలల పండుగ

ఆ యా వాక్య భాగములలో చెప్పబడిన ప్రకారము పైన యివ్వబడిన యేడు పండుగలలో మొదటి మూడు పండుగలు నిస్సాన్ నెల (మార్చి - ఏప్రిల్) 14,15,16 తారీఖులలో జరుపబడును. యిది ఇశ్రాయేలీయులకు వసంత కాలము (spring). నాలుగవ పండుగ సివన్ నెల (మే - జూన్) 6వ తారీఖున జరుపబడును. యిది యెండా కాలము (summer). చివరి మూడు పండుగలు టిశ్రె నెల (సెప్టెంబర్ - అక్టోబర్) 1, 10, 15 తారీఖులలో జరుపబడును. యిది శరత్‌కాలము (fall). అందుకే యీ పండుగలు “యెహోవా నియామక కాలములు”గా పిలువబడుచున్నవి (లేవీయకాండం 23:2). వీటిని ఆచరించు ఇశ్రాయేలీయులు “పరిశుద్ధ సంఘము”గా పిలువబడుచున్నారు (లేవీయకాండం 23:2). యిట్లు సంవత్సరములో మూడు నియామక కాలములలో యెరూషలేమునకు వచ్చుట ద్వారా ఇశ్రాయేలీయులు యీ యేడు పండుగలు జరుపుకొను చుండిరి. అందుకే దేవుడు ఇశ్రాయేలీయులతో

“సంవత్సరమునకు ముమ్మారు నీ పురుషులందరూ ప్రభువును, ఇశ్రాయేలీయుల దేవుడునైన యెహోవా సన్నిధిని కనబడవలెను” (నిర్గమకాండం 34:23; ద్వితీయోపదేశకాండం 16:16) అని ఆజ్ఞాపించాడు.

పై యేడు పండుగలు క్రింద తెలుపబడిన సత్యమునకు సాదృశ్యముగా వున్నవి.

1. పస్కా పండుగ – రక్షణ
2. పులియని రొట్టెల పండుగ – ప్రత్యేకించబడిన జీవితము
3. ప్రథమ ఫలముల పండుగ – పునరుత్థానము
4. వారముల పండుగ (పెంతెకొస్తు పండుగ) –పరిశుద్ధాత్మ కుమ్మరించబడుట, సంఘము స్థాపించబడుట
5. బూరల పండుగ – సాక్ష్యము, ఇశ్రాయేలీయులు సమకూర్చబడుట, సంఘ మెత్తబడుట
6. ప్రాయశ్చిత్తార్థ దినము – యేసుక్రీస్తు రెండవ రాకడ
7. పర్ణశాలల పండుగ – యేసుక్రీస్తు వెయ్యేండ్ల పాలన

యీ సంగతులను బట్టి మొదటి మూడు పండుగలు యేసుక్రీస్తు యొక్క మొదటి రాకను, నాలుగవ పండుగ ప్రస్తుత సంఘకాలమును, చివరి మూడు పండుగలు యేసుక్రీస్తు యొక్క రెండవ రాకడను సూచిస్తున్నవని గమనించగలము. యీ పండుగలను గూర్చిన ధ్యానము అనేకులకు మేలుకరముగా వుండవలెనని ప్రార్థిస్తున్నాను.

సహో. ధర్మా మల్లు M.Min

# విషయసూచిక


| | |
|---|---|
| ఉపోద్ఘాతము | iv |
| 1. పస్కా పండుగ | 1 |
| 2. పులియని రొట్టెల పండుగ | 9 |
| 3. ప్రథమ ఫలముల పండుగ | 14 |
| 4. వారముల పండుగ (పెంతెకొస్తు పండుగ) | 19 |
| 5. బూరల పండుగ | 23 |
| 6. ప్రాయశ్చిత్తార్థ దినము | 28 |
| 7. పర్ణశాలల పండుగ | 35 |

# 1. పస్కా పండుగ
## (Feast of Passover)

“మోషే అహరోనులు ఐగుప్తు దేశములో ఉండగా యెహోవా వారితో ఈలాగు సెలవిచ్చెను. నెలలలో ఈ నెల మీకు మొదటిది. యిది మీ సంవత్సరమునకు మొదటి నెల. మీరు ఇశ్రాయేలీయుల సర్వ సమాజముతో ఈ నెల దశమినాడు వారు తమతమ కుటుంబముల లెక్క చొప్పున ఒక్కొక్కడు గొఱ్ఱె పిల్లనైనను, మేక పిల్లనైనను తీసికొనవలెను. ఆ పిల్లను తినుటకు ఒక కుటుంబము చాలక పోయిన యెడల వాడును వాని పొరుగు వాడును తమ లెక్క చొప్పున దాని తీసికొనవలెను. ఆ గొఱ్ఱెపిల్లను భుజించుటకు ప్రతివాని భోజన పరిమితిని బట్టి వారిని లెక్కింపవలెను. నిర్దోషమైన యేడాది మగపిల్లను తీసికొనవలెను. గొఱ్ఱెలలోనుండియైనను, మేకలలో నుండియైనను దాని తీసికొనవచ్చును. ఈ నెల పదునాలుగవ దినము వరకు మీరు దానినుంచు కొనవలెను. తరువాత ఇశ్రాయేలు సమాజపు వారందరూ తమతమ కూటములలో సాయంకాలమందు దాని చంపి, దాని రక్తము కొంచెము తీసి, తాము దాని తిని, యిండ్ల ద్వార బంధపు రెండు నిలువు కమ్ముల మీదను, పై కమ్మి మీదను చల్లి, ఆ రాత్రియే వారు అగ్నిచేత కాల్చబడిన ఆ మాంసమును, పొంగని రొట్టెలను తినవలెను. చేదు కూరలతో దాని తినవలెను. దాని తలను, దాని కాళ్ళను, దాని ఆంత్రములను అగ్నితో కాల్చి, దాని తినవలెను. దానిలో ఉడికి ఉడకనిదైనను, నీళ్ళతో వండబడినదైనను తిననే తినకూడదు. ఉదయకాలము వరకు దానిలో దేదియు మిగిలింపకూడదు. ఉదయకాలము వరకు దానిలో మిగిలినది అగ్నితో కాల్చివేయవలెను. మీరు దాని తినవలసిన విధమేదనగా, మీ నడుము కట్టుకొని, మీ చెప్పులు తొడుగుకొని, మీ కఱ్ఱలు చేత పట్టుకొని, త్వరపడుచు దాని తినవలెను. అది యెహోవాకు పస్కా బలి.

ఆ రాత్రి నేను ఐగుప్తు దేశమందు సంచరించి, ఐగుప్తు దేశమందలి మనుష్యులలోనేగాని, జంతువులలోనేగాని తొలి సంతతియంతయు హతము చేసి, ఐగుప్తు దేవతలకందరికిని తీర్పు తీర్చెదను. నేను యెహోవాను. మీరున్న యిండ్ల మీద ఆ రక్తము మీకు గురుతుగా ఉండును. నేను ఆ రక్తమును చూచి, మిమ్మును నశింపజేయక దాటి పోయెదను. నేను ఐగుప్తు దేశమును పాడుచేయుచుండగా మిమ్మును సంహరించుటకు తెగులు మీ మీదికి రాదు. కాబట్టి యీ దినము మీకు జ్ఞాపకార్థమైనదగును. మీరు యెహోవాకు పండుగగా దాని నాచరింపవలెను. తరతరములకు నిత్యమైన కట్టడగా దాని నాచరింప వలెను” (నిర్గమ కాండం 12:1–15).

“మొదటి నెల పదునాలుగవ దినమున సాయంకాలమందు యెహోవా పస్కా పండుగ జరుగును” (లేవీయ కాండం 23:5).

ఇశ్రాయేలీయులు యోసేపు కాలములో ఐగుప్తుకు వెళ్ళారు. అక్కడ యోసేపు చనిపోయిన కొన్ని సంవత్సరముల తరువాత ఐగుప్తు క్రొత్తరాజు ఫరో ఇశ్రాయేలీయులను బానిసలుగా మార్చి, వారితో కఠినమైన సేవ, వెట్టి పనులు చేయించాడు. దానిని బట్టి ఇశ్రాయేలీయులు యెహోవాకు మొర పెట్టగా, యెహోవా మోషే, అహరోనుల ద్వారా కొన్ని తెగుళ్ళు ఐగుప్తు దేశము మీదికి రప్పించాడు. అవేవనగా

❊ నైలు నది నీళ్ళను రక్తముగా మార్చుట

❊ ఐగుప్తు దేశములోనికి కప్పలను రప్పించుట

❊ ఐగుప్తీయుల మీదికి, జంతువుల మీదికి పేళ్లను రప్పించుట

❊ ఈగల గుంపులను రప్పించుట

❊ ఐగుప్తు పశువులను వ్యాధితో సంహరించుట

❊ ఐగుప్తీయులను, వారి జంతువులను దద్దురులతో బాధించుట

❊ ఐగుప్తు దేశము మీదికి అగ్ని, వడగండ్లను రప్పించి, పొలములో వున్న మనుష్యులను, జంతువులను సంహరించుట
❊ మిడుతల గుంపును రప్పించి, ఐగుప్తీయుల పొలములను పాడుచేయుట
❊ చిక్కని చీకటితో ఐగుప్తు దేశమును మొత్తుట

యీ సంగతులను నిర్గమ కాండం మొదటి పది అధ్యాయములలో చదువుదుము. అయితే పదకొండవ అధ్యాయములో మిక్కిలి బాధాకరమైన పదవ తెగులు గూర్చి, అనగా ఐగుప్తీయులు, వారి జంతువులలో తొలి సంతతిని దేవుడు హతము చేయుబోవునని వ్రాయబడినది. యీ ఉగ్రత నుండి తప్పించుకొనుటకు ఇశ్రాయేలీయులు గొఱ్ఱె లేదా మేక పిల్లను చంపి, దాని రక్తమును తమ యిండ్ల ద్వారబంధపు రెండు నిలువు కమ్ముల మీదను, పై కమ్మి మీదను చల్లి, ఆ రాత్రికి తమ యిండ్లలో వుండవలెనని పై వాక్యభాగములో చదువుచున్నాము.

దేవుడు తమకు చెప్పినట్లు చేసి, పస్కా పండుగను ఆచరించుట ద్వారా ఇశ్రాయేలీయులు దేవుని ఉగ్రతనుండి మరియు ఐగుప్తు బానిసత్వము నుండి తప్పించబడిరి. ఐగుప్తులో ఆ రోజు ఇశ్రాయేలీయులు పొందిన యీ అనుభవము యేసుక్రీస్తు ద్వారా మానవులు పొందు పాపవిమోచన అనుభవమును సూచిస్తున్నదని క్రింద వ్రాయబడిన సంగతులను బట్టి గమనించుదుము.

1) పస్కా పండుగలో పస్కా బలిగా వాడబడిన గొఱ్ఱెపిల్ల లేదా మేక పిల్ల యేసుక్రీస్తును సూచిస్తున్నది. 'క్రీస్తు అను మన పస్కా పశువు వధింపబడెను......' 1 కొరింథీ 5:7. బాప్తిస్మమిచ్చు యోహాను యేసు తన యొద్దకు రాగా చూచి, 'ఇదిగో లోక పాపమును మోసికొని పోవు దేవుని గొఱ్ఱె పిల్ల' (యోహాను 1:29,36) అని చెప్పాడు. యేసుక్రీస్తు 'గొఱ్ఱెపిల్ల'గా ప్రకటన

5:12-14లో స్తుతించ బడుచున్నాడు.

2) ఈ గొఱ్ఱెపిల్ల లేదా మేక పిల్లను యూదులు మొదటి నెల (నిస్సాన్) పదవ రోజు తీసుకొని, పదు నాలుగవ దినము సాయంకాలమందు దానిని చంపిరి (నిర్గమ కాండం 12:1-3,7). యేసుక్రీస్తు నిస్సాన్ నెలలో యెరూషలేములో ప్రవేశించి, ఆ నెల పదునాలుగవ దినమున (మనకు శుక్రవారం) సాయంత్రం మూడు గంటలకు సిలువలో ప్రాణము విడిచెను (యోహాను 12:1,12; మత్తయి 27:45-50).

3) ఈ గొఱ్ఱెపిల్ల లేదా మేకపిల్ల యేడాది వయసుగల మగపిల్లయై యుండవలెను (నిర్గమ కాండం 12:6). యేసుక్రీస్తు ముప్పైమూడు సంవత్సరముల యవ్వన దశలో మన కొరకు మరణించాడు.

4) ఈ గొఱ్ఱెపిల్ల లేదా మేకపిల్ల నిర్దోషమైనదై యుండవలెను (నిర్గమ కాండం 12:6). మనము నిర్దోషమును, నిష్కళంకమునగు గొఱ్ఱెపిల్లవంటి క్రీస్తు రక్తముచేత విమోచింపబడియున్నామని పేతురు చెప్పాడు (1పేతురు 1:19). యేసుక్రీస్తు 'పవిత్రుడు, నిర్దోషి, నిష్కల్మషుడు, పాపులలో చేరక ప్రత్యేకముగా వున్నవాడు' (హెబ్రీ 7:26). ఆయన పాపమెరుగడు (2 కొరింథీ 5:21).

5) చంపబడిన గొఱ్ఱెపిల్ల లేదా మేకపిల్ల యొక్క యెముకలు విరువకూడదు (నిర్గమ కాండం 12:46). యెముకలు బలమునకు గుర్తు. దేవుడైన యేసుక్రీస్తు బలమును మానవుడు యెదిరించలేదనుటకు గుర్తుగా ఆయన యెముకలు విరుగగొట్టబడలేదు (యోహాను 19:31-36).

6) గొఱ్ఱెపిల్ల లేదా మేకపిల్ల మాంసము మరుసటి రోజు ఉదయం వరకు మిగిలింప కూడదు (నిర్గమ కాండం 12:10). యేసుక్రీస్తు దేహము సిలువ వేయబడిన రోజే సమాధి చేయబడెను (మత్తయి 27:57-61).

7) గొఱ్ఱెపిల్ల లేదా మేకపిల్ల మాంసమును అన్యుడెవడును తినకూడదు (నిర్గమ

కాండం 12:43). పస్కా బలిని సూచించు యేసుక్రీస్తు యొక్క శరీరమునకు సాదృశ్యమైన రొట్టెలో అయోగ్యముగా పాలు పొందకూడదని ప్రభువు రాత్రి భోజనము ద్వారా హెచ్చరింపబడుచున్నాము (1 కొరింథీ 11:27-30).

8) గొఱ్ఱెపిల్ల లేదా మేకపిల్ల రక్తమును తమ యిండ్ల ద్వార బంధపు నిలువు కమ్ములు, పై కమ్మికి చల్లుకొని, యిండ్లలో వుండుటను బట్టి ఇశ్రాయేలీయులు మరణము నుండి (దేవుని ఉగ్రత) నుండి తప్పింపబడిరి (నిర్గమ కాండం 12:7,21-23). అయితే ఐగుప్తీయుల యిండ్లలోని తొలి సంతామును, వారి పశువుల తొలి సంతానమును యెహోవా హతము చేసి, తన ఉగ్రతను చూపించెను (నిర్గమ కాండం 12:29-30). ప్రతి మానవుడు పాపియని (రోమా 3:23), స్వభావ సిద్ధముగా దేవుని ఉగ్రతకు, మరణమునకు పాత్రుడని (రోమా 6:23; ఎఫెసీ 2:3) దేవుని వాక్యము సెలవిస్తుంది. అయితే మానవుని పాపమును కడిగి, దేవుని ఉగ్రత నుండి మానవుని తప్పించుటకు యేసుక్రీస్తు ఒక పస్కా బలిగా తనను తాను అప్పగించుకొన్నాడు (1 కొరింథీ 5:7). యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేస్తుంది (1యోహాను 1:7; హెబ్రీ 9:14). రాబోవు దేవుని ఉగ్రత నుండి యేసుక్రీస్తు తనయందు విశ్వాసముంచువారిని తప్పించును (1 థెస్సలొనీకయులకు 1:10; రోమా 8:1). యేసుక్రీస్తు దేవునికి మానవులకు మధ్యవర్తిగా (1తిమోతి 2:5), మన పాపములకు శాంతికరముగా (1యోహాను 2:2) వున్నాడు. మనలను నాశనము నుండి తప్పించి, నిత్యజీవమిస్తాడు (యోహాను 3:16, 36, 5:24).

9) ఇశ్రాయేలీయులు గొఱ్ఱెపిల్ల లేదా మేకపిల్ల రక్తమును తమ యిండ్ల ద్వారబంధపు నిలువు కమ్ములకు, పై కమ్మికి చల్లుకొన్న తరువాత దాని మాంసమును అగ్నితో కాల్చి, భుజించిరి (నిర్గమ కాండం 12:8-9). అదే రాత్రి ఐగుప్తును వదలి, కాలినడకన బయలుదేరిరి (నిర్గమ కాండం 12:41).

ఐగుప్తు బానిసత్వమునుండి ఆ రోజు శాశ్వతముగా విడుదల పొందిరి. యీ సంఘటన మానవులు యేసుక్రీస్తు రక్తముతో తమ పాపములు కడుగుకొని, పాపబానిసత్వము నుండి విడుదల పొంది, యేసుక్రీస్తుతో విశ్వాసయాత్రను ప్రారంభించడాన్ని సూచిస్తున్నది.

a) ఇశ్రాయేలీయులు గొఱ్ఱెపిల్ల మాంసమును అగ్నితో కాల్చిరి (నిర్గమ కాండం 12:8-9). యీ మాట యేసుక్రీస్తు పొందిన శ్రమను సూచిస్తున్నది. అగ్నితో కాల్చబడినప్పుడు ఆ వేడి మాంసములోనికి చొచ్చుకు వెళుతుంది. యిది దేవుని ఉగ్రతను సూచిస్తున్నది. మనలను దేవుని ఉగ్రత నుండి తప్పించుటకు యేసుక్రీస్తు తానే దేవుని ఉగ్రతను భరించాడు (1థెస్సలొనీకయులకు 1:10). 'ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసికొనెను. ఆయన పొందిన గాయముల చేత మీరు స్వస్థత నొందితిరి' (1పేతురు 2:24). యెషయా 53లో యేసుక్రీస్తు మన కొరకై పొందిన శ్రమను చూడగలము.

b) ఇశ్రాయేలీయులు కాలి నడకన బయలుదేరుటకు కావలసిన బలమును కాల్చబడిన గొఱ్ఱెపిల్ల మాంసమును భుజించుట ద్వారా పొందిరి. యేసుక్రీస్తు మన ఆత్మలకు అవసరమైన జీవాహారముగా వున్నాడు. "జీవాహారమును నేనే. నా యొద్దకు వచ్చువాడు ఏ మాత్రమును ఆకలిగొనడు. నా యందు విశ్వాసముంచువాడు ఎప్పుడును దప్పిగొనడు" (యోహాను 6:35). ఆత్మీయంగా యెదిగి, ముందుకు సాగుటకు దేవుని వాక్యమను జీవాహారముగా తానున్నానని యేసుక్రీస్తు బయలుపరిచాడు (యోహాను 6:50-59).

☼ కాల్చబడిన గొఱ్ఱెపిల్ల తలను తినడమనగా యేసుక్రీస్తు యొక్క తలంపులు, ఆయన మనస్సును కలిగియుండుట.

☼ కాల్చబడిన గొఱ్ఱెపిల్ల యొక్క కాళ్ళను తినడమనగా యేసుక్రీస్తు నడిచిన నడక (ఆయన జీవన విధానము) ను అనుసరించుట.

❊ కాల్చబడిన గొఱ్ఱెపిల్ల యొక్క ఆంత్రములను తినడమనగా యేసుక్రీస్తులో మనము కనుగొన్న ప్రేమ, జ్ఞానము, వినయము, పరిశుద్ధత మొదలగు వాటిని కలిగియుండుట.

10) చివరిగా పస్కా బలి మాంసమును తినవలసిన పద్ధతి క్రింద తెలియ పరచబడినది:

a) చేదు కూరలతో దాని తినవలెను (నిర్గమ కాండం 12:8). యీ మాట యేసుక్రీస్తు శ్రమను (యెషయా 53) సూచిస్తున్నది. యేసుక్రీస్తు శ్రమను జ్ఞాపకము చేసుకొని, ఆయన మరణమును ప్రచురించుటకు విశ్వాసులు ప్రభువు బల్లలో పాలు పొందవలెనని ఆజ్ఞాపించబడిరి (1 కొరింథీ 11:23-26). అంతేగాక, చేదుకూరలతో పస్కాబలి తినడమను మాట క్రీస్తు శ్రమలలో మనము కూడా పాలివారముగా వుందుమన్న సత్యమును సూచిస్తున్నది (ఫిలిప్పీ 3:10-11; 2 తిమోతి 2:3).

b) మీ నడుము కట్టుకొని, మీ చెప్పులు తొడుగుకొని, మీ కఱ్ఱలు చేతపట్టుకొని, త్వరపడుచు దాని తినవలెను (నిర్గమ కాండం 12:11). పస్కా భోజనమైన వెంటనే ఇశ్రాయేలీయులు ఆలస్యము చేయకుండా, ఐగుప్తును వదలి, తమ ప్రయాణమును మొదలుపెట్టవలెనను ఉద్దేశ్యముతో యీ రీతిగా పస్కాబలిని తినుటకు వారు దేవుని చేత ఆజ్ఞాపింపబడిరి. నడుము కట్టుకొనుట, చెప్పులు తొడుగు కొనుట, కఱ్ఱలు చేత పట్టుకొనుట, త్వరపడుచు తినుట అనుమాటలు ప్రయాణము కొరకైన సిద్ధపాటును సూచించుచున్నవి.

యేసుక్రీస్తును జీవాహారముగా కలిగియుండు విశ్వాసులు తమ విశ్వాస ప్రయాణములో సత్యమను దట్టి నడుమునకు కట్టుకొని, పాదములకు సమాధాన సువార్త వలననైన సిద్ధమనస్సను జోడు తొడుగు కొనవలెనని ఎఫెసీ 6:14-15లో వ్రాయబడినది. పేతురు “మీ మనస్సు అను నడుము కట్టుకొని,

నిబ్బరమైన బుద్ధిగల వారుగా” వుండవలెనని 1 పేతురు 1:13లో సెలవిచ్చాడు. మనస్సు అను నడుము కట్టుకొనడమనగా యీ జీవన వ్యాపారములో చిక్కుకొనకుండా (2 తిమోతి 4:2), క్రీస్తును గురిగా కలిగి జీవించుట (కొలస్సీ 3:1–4). ఐగుప్తును వదలి, దేవుని చేత ప్రయాణములో నడిపింపబడుటకు యెలాగైతే ఇశ్రాయేలీయులు సంసిద్ధులై, త్వరపాటును కలిగియుండిరో విశ్వాసులు కూడా క్రీస్తును వెంబడించు విషయములో అట్టి సంసిద్ధత, త్వరపాటు కలిగి యుండవలెను.

# 2. పులియని రొట్టెల పండుగ

## (Feast of Unleavened Bread)

“ఈ నెల పదునయిదవ దినమున యెహోవాకు పొంగని రొట్టెల పండుగ జరుగును; ఏడు దినములు మీరు పొంగని వాటినే తినవలెను. మొదటి దినమున మీరు పరిశుద్ధ సంఘముగా కూడవలెను. అందులో మీరు జీవనోపాధియైన ఏ పనియూ చేయకూడదు. ఏడు దినములు మీరు యెహోవాకు హోమార్పణము చేయవలెను. ఏడవ దినమున పరిశుద్ధ సంఘముగా కూడవలెను. అందులో మీరు జీవనోపాధియైన ఏ పనియు చేయకూడదని వారితో చెప్పుము” (లేవీయ కాండం 23:6-8).

“ఏడు దినములు పులియని రొట్టెలను తినవలెను. మొదటి దినమున మీ యిండ్లలో నుండి పొంగినది పారవేయవలెను. మొదటి దినము మొదలుకొని యేడవ దినము వరకు పులిసిన దానిని తిను ప్రతి మనుష్యుడు ఇశ్రాయేలీయులలో నుండి కొట్టివేయబడును. ఆ మొదటి దినమున మీరు పరిశుద్ధ సంఘముగాను, ఏడవ దినమున పరిశుద్ధ సంఘముగాను కూడు కొనవలెను. ఆ దినములయందు ప్రతివాడు తినవలసినది మాత్రమే మీరు సిద్ధపరచవచ్చును. అదియు గాక మరి ఏ పనియు చేయకూడదు. పులియని రొట్టెల పండుగను మీరు ఆచరింపవలెను. ఈ దినమందే నేను మీ సమూహములను ఐగుప్తు దేశములోనుండి వెలుపలికి రప్పించితిని గనుక మీరు మీ తరములన్నిటిలో ఈ దినమునాచరింపవలెను. ఇది మీకు నిత్యమైన కట్టడగా వుండును. మొదటి నెల పదనాలుగవ దినము సాయంకాలము మొదలుకొని ఆ నెల యిరువది యొకటవ దినము సాయంకాలము వరకు మీరు పులియని రొట్టెలను తినవలెను. ఏడు దినములు మీ యిండ్లలో పొంగినదేదియును వుండకూడదు. పులిసిన దానిని తినువాడు అన్యుడేగాని,

దేశములో పుట్టినవాడే గాని  ఇశ్రాయేలీయుల సమాజములో నుండక కొట్టివేయబడును. మీరు పులిసినదేదియు తినక, మీ నివాసములన్నిటిలోను పులియని వాటినే తినవలెనని చెప్పుమనెను" (నిర్గమ కాండం 12:15-20).

ఇశ్రాయేలీయులు పస్కాబలి గొఱ్ఱెపిల్ల రక్తమును  తమ యిండ్ల నిలువు కమ్ములు, పై కమ్ములకు చల్లుకొన్న తరువాత గొఱ్ఱెపిల్ల మాంసమును అగ్నితో కాల్చి, పులియని (పొంగని) రొట్టెలతో దానిని తినవలెనని ఆజ్ఞాపింపబడిరి (నిర్గమ కాండం 12:8). అయితే ఆలాగు పులియని రొట్టెలతో మాంసమును తినుటకు ముందు, వారి యిండ్లలో నుండి పులిసినది, పొంగినది యేదియు కనబడకుండా  బయట పారవేయవలెనని ఆజ్ఞాపింపబడిరి (నిర్గమ కాండం 12:15, 13:7). పులిసినది తినువాడు ఇశ్రాయేలీయులలో నుండి కొట్టివేయబడునని వ్రాయబడినది (నిర్గమ కాండం 12:15). ఇక్కడ మనము గమనించిన యెడల, గొఱ్ఱెపిల్ల రక్తము ద్వారము వెలుపల కలిగి, దాని మాంసమును లోపలికి తీసుకురావడాన్ని బట్టి పులిసిన రొట్టెలు బయట పారవేయబడి, పులియని రొట్టెలు క్రొత్తగా తయారు చేయబడి, వాటితో గొఱ్ఱెపిల్ల మాంసము ఇశ్రాయేలీయులచేత తినబడుచున్నది. అలాగే మానవులు యేసు రక్తమును తమ ఆత్మలకు రక్షణగా కలిగి, యేసును జీవాహారముగా తమ లోనికి స్వీకరించినప్పుడు వారిలోని పాపపు అలవాట్లు పోయి, పరిశుద్ధ పరచబడుదురు. యిది విశ్వాసుల జీవితమంతయు జరుగు ఒక ప్రక్రియ. దీనిని గూర్చిన వివరణ క్రింద యివ్వబడినది.

పులిసిన పిండి పాపమును సూచిస్తున్నది (మార్కు 8:15). పౌలు దీనిని విశ్వాసులలో వుండు 'పాప నియమము'గా వివరించాడు (రోమా 7:15-25). తిరిగి రోమా 8:6లో దీనిని 'శరీరానుసారమైన మనస్సు'గా వర్ణించాడు. యేసుక్రీస్తు ద్వారా దేవుడు మనలను రక్షించుటకు ముందు  మనము భ్రష్టమైన

మనసు గలిగి, సమస్తమైన దుర్నీతి చేతను, దుష్టత్వము చేతను, లోభము చేతను, ఈర్ష్య చేతను నిండుకొని, మత్సరము, నరహత్య, కలహము, కపటము, వైరముతో నిండిన వారమై, కొండెగాండ్రును, అపవాదకులును, దేవద్వేషు లును, హింసకులును, అహంకారులును, బింకములాడువారును, చెడ్డవాటిని కల్పించువారును, తలిదండ్రులకవిధేయులును, అవివేకులును, మాట తప్పువారును, అనురాగ రహితులును, నిర్దయులుగాను వుంటిమి (రోమా 1:28–30; తీతు 3:3). రక్షించబడిన తరువాత దేవుడు మన పాపములను క్షమించినప్పటికీ, మన పాపపు స్వభావమును తీసివేయలేదు. అందుకే దేవుని వాక్యము విశ్వాసులలో ప్రాచీన స్వభావము మరియు నవీన స్వభావము వున్నట్లుగా తెలియ జేయు చున్నది (ఎఫెసీ 4:22–24; కొలస్సీ 3:9–10).

యీ ప్రాచీన స్వభావము లేదా శరీరానుసారమైన మనస్సు మనలోని దేవుని ఆత్మకు విరోధముగా పనిచేయుచుండును (రోమా 8:7; గలతీ 5:17; 1పేతురు 2:11). దీని కారణంగానే విశ్వాసుల మధ్య మత్సరము, వివాదములు, అల్లరి, కలహములు, క్రోధములు, కక్షలు, కొండెములు, గుసగుసలాడుట, ఉప్పొంగుట, అపవిత్రత, జారత్వము మొదలగునవి వున్నాయి (యాకోబు 3:14; 2 కొరింథీ 12:20). గలతీ 5:19–21లో శరీరకార్యముల గురించి వ్రాయబడినది. మనలో వున్న దేవుని ఆత్మకు లోబడకుండా శరీరకార్యములను నెరవేర్చినట్లయితే మన ఆత్మీయ జీవితములకు యెంతో నష్టము కొని తెచ్చుకొందుము.

అయితే, పాత పులిసిన పిండిని సూచిస్తున్న యీ ప్రాచీన స్వభావము (లేదా శరీరానుసారమైన మనస్సు)ను అధిగమించి, యేసుక్రీస్తును జీవాహారముగా కలిగి, నూతన స్వభావము (పులియని పిండి)లో యెదుగుటకు క్రింది సత్యమును తెలుసుకొని, ఆచరించవలెనని గమనించగలము.

1) దేవుడు ప్రతి విధమైన పాపమునకు (పులిసిన పిండికి) తన సొంత కుమారుడైన యేసుక్రీస్తు శరీరమందు శిక్షవిధించెను. కనుక క్రీస్తుయేసు నందున్న వారికి యే శిక్షావిధియు లేదు (రోమా 8:1-4).

2) పాపము విషయమై మృతులుగా, దేవుని విషయమై క్రీస్తుయేసునందు సజీవులుగా మనలను మనము యెంచుకొనవలెను (రోమా 6:11). క్రీస్తుయేసు సంబంధులు శరీరమును దాని యిచ్ఛలతోను, దురాశలతోను సిలువ వేసియున్నారని గలతి 5:24లో దేవుని వాక్యము సెలవిస్తున్నది.

3) యేసుక్రీస్తు శరీరము పులియని రొట్టెకు సాదృశ్యముగా వున్నది (కీర్తన 16:10; అపొ.కా. 2:27). ఈ పులియని రొట్టెను మన ఆత్మలకు ఆహారముగా కలిగి, మనలోనుండి పులిసినది బయట పారవేయాలి. అనగా దేవుని వాక్యపు వెలుగులో మన జీవితాలను స్వయం పరిశీలన (Self Examination) చేసికొని, పొరపాటులు సరిచేసికొనవలెను. అనేక మారులు మనము మన పొరపాట్లను పక్కన పెట్టి, యితరుల పొరపాట్లు, పతనములను యెత్తి చూపు వారంగా వుంటాము. అయితే మన జీవితాలను మనకు మనమే వాక్యపు వెలుగులో సరిజేసుకొనవలెనని వాక్యములో హెచ్చరించబడు చున్నాము (1కొరింథీ 11:27-31). "దేవా నన్ను పరిశోధించి, నా హృదయమును తెలిసికొనుము. నన్ను పరీక్షించి, నా ఆలోచనలను తెలిసికొనుము. నీకాయాసకరమైన మార్గము నాయందున్నదేమోచూడుము. నిత్య మార్గమున నన్ను నడిపింపుము" అని దావీదు రాజు స్వయం పరిశీలన చేసుకున్నాడు (కీర్తన 139:23-24). ఇశ్రాయేలీయులు పులియని రొట్టెల పండుగ జరుపుకొనుటకు ముందు తమ దగ్గరున్న పులిసినదంతటినీ పారవేయవలెనని దేవుని చేత ఆజ్ఞాపించబడిరి (నిర్గమ కాండం 13:7).

అంతేగాక మనము పాపము చేయకుండునట్లు దేవుని వాక్యమును మన

హృదయములలో దాచుకొనవలెను (కీర్తన 119:11; కొలస్సీ 3:16).

4) పులిసిన పిండియైన శరీరకార్యములను జరిగించకూడదు. ఈ సత్యమును క్రింది వచనముల ద్వారా చూచెదము:

a) ఆత్మచేత శరీరకార్యములను చంపుడి..........రోమా 8:13

b) శరీరము విషయమై ఆలోచన చేసికొనకుడి....రోమా 13:14

c) ఆత్మకు విరోధముగా పోరాడు శరీరాశలను విసర్జించుడి....1పేతురు 2:11

d) శరీర సంబంధమైన వారి అపవిత్ర ప్రవర్తనకు ఏ మాత్రము ఒప్పుకొనకుడి.........యూదా 1:23

e) ప్రాచీన స్వభావమును దాని క్రియలతో కూడా పరిత్యజించుడి......
కొలస్సీ3:5-9; ఎఫెసీ 4:22

5) క్రీస్తునందు నవీన స్వభావమును ధరించి (ఎఫెసీ 4:23-24), ఆత్మననుసరించి నడుచుకొని (గలతీ 5:25), పాపము నుండి ప్రత్యేకింపబడిన జీవితమును జీవించవలెను (2కొరింథీ6:17-18;1 థెస్సలొనీకయులకు 5:22).

పై విధముగా జరిగించినపుడు ఇశ్రాయేలీయులు ఆచరించిన "పులియని రొట్టెల పండుగ"ను సూచక ప్రాయంగా మన ఆత్మీయ జీవితములలో కలిగియుందుము. అనగా పాపము నుండి ప్రత్యేకించబడిన జీవితమును కలిగియుందుము. "పులిసిన పిండి కొంచెమైనను ముద్దంతయు పులియ జేయునని మీరెరుగరా? మీరు పులిపిండి లేనివారు గనుక క్రొత్తముద్ద అవుటకై ఆ పాతదైన పులిపిండిని తీసి పారవేయుడి. ఇంతేగాక క్రీస్తు అను మన పస్కా పశువు వధింపబడెను. గనుక పాతదైన పులిపిండితోనైనను దుర్మార్గతయు, దుష్టత్వమునను పులిపిండితోనైనను కాకుండ, నిష్కాపట్యమును, సత్యముననను పులియని రొట్టెతో పండుగ ఆచరింతుము" (1కొరింథీ 5:6-8).

# 3. ప్రథమ ఫలముల పండుగ

## (Feast of First Fruits)

"మరియు యెహోవా మోషేకు ఈలాగు సెలవిచ్చెను. నీవు ఇశ్రాయేలీయులతో యిట్లనుము – నేను మీకిచ్చుచున్న దేశమునకు మీరు వచ్చి, దాని పంటను కోయునప్పుడు మీ మొదటి పంటలో ఒక పనను యాజకుని యొద్దకు తేవలెను. యెహోవా మిమ్ము అంగీకరించునట్లు అతడు యెహోవా సన్నిధిని ఆ పనను అల్లాడింపవలెను. మీరు ఆ పనను అర్పించు దినమున నిర్దోషమైన యేడాది పొట్టేలును యెహోవాకు దహనబలిగా అర్పింపవలెను. దాని నైవేద్యము నూనెతో కలిసిన రెండు పదియవ వంతుల గోధుమ పిండి. అది యెహోవాకు యింపైన సువాసన గల హోమము. దాని పానార్పణము ముప్పావు ద్రాక్షారసము. మీరు మీ దేవునికి అర్పణము తెచ్చువరకు ఆ దినమెల్ల మీరు రొట్టెయేమి, పేలాలేమి, పచ్చని వెన్నులేమి తినకూడదు. ఇది మీ తరతరములకు మీ నివాస స్థలములన్నిటిలో నిత్యమైన కట్టడ" (లేవీయ కాండం 23:9–14).

"ఇప్పుడైతే నిద్రించిన వారిలో ప్రథమ ఫలముగా క్రీస్తు మృతులలో నుండి లేపబడియున్నాడు. మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానమును కలిగెను. ఆదాము నందు అందరూ యేలాగు మృతి పొందుచున్నారో ఆలాగుననే క్రీస్తునందు అందరూ బ్రతికింపబడుదురు. ప్రతివాడును తన తన వరుసలోనే బ్రతికింపబడును. ప్రథమ ఫలము క్రీస్తు. తరువాత క్రీస్తు వచ్చినప్పుడు ఆయనవారు బ్రతికింపబడుదురు" (1 కొరింథీ 15:20–23).

ఇశ్రాయేలీయులు కనాను దేశములో దేవుడు వారిని ప్రవేశపెట్టిన తరువాత వారి మొదటి పంటలో ఒక పనను దేవునికి అర్పణముగా అర్పించుట ద్వారా 'ప్రథమ ఫలముల' పండుగ జరుపుకొనవలెనని ఆజ్ఞాపింపబడిరి (ద్వితీయో

పదేశ కాండం26:1-11). నిస్సాన్ నెల పదహారవ దినమున వారు యీ పండుగను జరుపుకొనిరి. వారి మొదటి పంటలో కోయబడిన 'పన' దేవుని సన్నిధిలో అల్లాడింపబడుచున్నది. యీ పన ప్రభువైన యేసుక్రీస్తును సూచి స్తున్నది. పంటలో వున్న అనేక పనలలో యీ పన దేవుని సన్నిధిలో అల్లాడింప బడినట్లు అనేకమైన మృతులలోనుండి మొట్టమొదటగా ప్రభువైన యేసుక్రీస్తు సజీవుడై లేచి, దేవుని సన్నిధికి వెళ్ళాడు. అనగా ప్రథమ ఫలముల పండుగ యేసుక్రీస్తు యొక్క పునరుత్థానమును సూచిస్తున్నది. దేవుని సన్నిధిలో వున్నటువంటి మొదటి పన చేనులో వున్నటువంటి మిగిలిన పంటకంతటికీ ప్రాతినిథ్యం వహిస్తుంది. అలాగే దేవుని సన్నిధిలో వున్న ప్రభువైన యేసుక్రీస్తు మృతులైన విశ్వాసులకు మరియు సజీవులైన విశ్వాసులకు దేవుని సన్నిధిలో ప్రాతినిథ్యము వహించుచున్నాడు. పంట చేనులో నుండి కోయబడి, దేవుని సన్నిధికి తీసుకు వెళ్ళబడిన పనను బట్టి ఆ పన స్థానము పంటలో ఖాళీగా వున్నది. ఈ మాట యేసుక్రీస్తు పునరుత్థానుడైనందుకు ఖాళీగా వున్న సమాధిని సూచిస్తున్నది.

యేసుక్రీస్తు పునరుత్థానము యొక్క ముఖ్య ఉద్దేశ్యములు, తద్వారా విశ్వాసులకు కలుగు ఆశీర్వాదములను గురించి మనము ధ్యానించిన యెడల:

1) యేసుక్రీస్తు లేఖనములను నెరవేర్చుటకు పునరుత్థానుయ్యాడు (లూకా 24:45,46).

2) క్రీస్తు పునరుత్థానము ద్వారా ఆయన కుమారత్వము నిరూపింపబడినది (రోమా 1:4).

3) క్రీస్తు పునరుత్థానము ద్వారా ఆయన రాజరికము ఖచ్చితము చేయబడినది (అపొ.కా. 2:30-32).

4) క్రీస్తు పునరుత్థానుడగుట ద్వారా అన్నిటికంటె పైగా హెచ్చింపబడ్డాడు

(ఫిలిప్పీ 2:9,10).

5) క్రీస్తు పునరుత్థానమును బట్టి మనుష్యులకందరికీ తీర్పు తీర్చెడి దినము నిర్ణయింపబడినది (అపొ.కా. 17:31).

6) చివరిగా దేవుని వాక్యము ఎఫెసీ 1:3లో "ఆయన క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మనకనుగ్రహించెను" అని సెలవిస్తున్నది. యేసు తన మరణము ద్వారా విశ్వాసులకు పాపవిమోచన కలిగించాడు. తన పునరుత్థానము ద్వారా పరసంబంధమైన ఆశీర్వాదములను విశ్వాసులకు కలుగజేసాడు. అవేవనగా:

a) మనము నీతిమంతులముగా తీర్చబడుటకు ఆయన పునరుత్థానుడయ్యాడు (రోమా4:24,25, 8:34).

b) క్రీస్తు పునరుత్థానమును బట్టి దేవుని సన్నిధిలో మనము ప్రవేశింప గలుగుచున్నాము (హెబ్రీ 10:19-22).

c) క్రీస్తు పునరుత్థానమును బట్టి ఆయన యందు విశ్వాసముంచు వారును పునరుత్థానులౌతారన్న నిరీక్షణ విశ్వాసులకు కలిగినది (యోహాను 11:25; 1కొరింథీ 15:18-20, 23).

d) క్రీస్తు పునరుత్థానమును బట్టి విశ్వాసుల విశ్వాసము నిజమైనదాయెను (1కొరింథీ 15:14-17).

e) విశ్వాసుల శరీరములు పునరుత్థానమైనప్పుడు:

※ క్షయమైన శరీరము అక్షయమైనదిగా మారును (1కొరింథీ 15:42,54).

※ ఘన హీనమైన శరీరము మహిమగలదిగా లేపబడును (1కొరింథీ 15:43).

※ ప్రకృతి సంబంధమైన శరీరము ఆత్మసంబంధమైనదిగా లేపబడును (1కొరింథీ 15:44).

※ దీనమైన శరీరము యేసుక్రీస్తు యొక్క మహిమ గల శరీరముగా

మార్చబడును (ఫిలిప్పీ 3:21).
※ యేసుక్రీస్తు శరీరము తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ శక్తితో పునరుత్థానమైన రీతిలో (అపొ.కా. 2:24; యోహాను 10:18; రోమా 8:11), విశ్వాసులు కూడా త్రిత్వమైన దైవశక్తితో లేపబడెదరు (మత్తయి 22:29-32; యోహాను 5:28,29; రోమా 8:11).

ఇశ్రాయేలీయులు నిస్సాన్ నెల పదునాలుగవ దినమున పస్కా పండుగను, పదునైదవ దినమున పులియని రొట్టెల పండుగను, పదునారవ దినమున ప్రథమ ఫలముల పండుగను జరుపుకొనిరి.
※ పస్కా పండుగ విశ్వాసుల మరణమును సూచిస్తున్నది. అనగా మనము క్రీస్తుతో కూడా చనిపోయాము. మన ప్రాచీన స్వభావము ఆయనతో కూడా సిలువ వేయబడింది (రోమా 6:6,8).
※ పులియని రొట్టెల పండుగ విశ్వాసుల సమాధి జీవితమును సూచిస్తున్నది. అనగా మన ప్రాచీన స్వభావము పాతి పెట్టబడి, నూతన జీవము కలిగిన వారముగా నూతన స్వభావముతో నడుచుకొను చున్నాము (రోమా 6:4).
※ ప్రథమ ఫలముల పండుగ విశ్వాసుల పునరుత్థానమును సూచిస్తున్నది. అనగా క్రీస్తుతో కూడా చనిపోయిన యెడల ఆయనతో కూడా జీవించుదుము (రోమా 6:8-9).

ప్రియులారా, పైన తెలుప బడిన మూడు రకముల అనుభవములలోనికి నడిపించబడగోరుచున్నావా? దేవుని వాక్యమైన బైబిల్‌లో యీ భూమి మీద జీవితము తరువాత యింకొక జీవితమున్నదని సృష్టంగా సెలవిస్తున్నది. "మరియు సమాధులలో నిద్రించు అనేకులు మేలుకొనెదరు. కొందరు నిత్యజీవము అనుభవించుటకును, కొందరు నిందపాలగుటకును, నిత్యముగా హేయులగుటకును మేలుకొందురు" (దానియేలు 12:2). "ఒక కాలము

వచ్చుచున్నది. ఆ కాలమున సమాధులలో నున్న వారందరు ఆయన శబ్దము విని, మేలు చేసినవారు జీవ పునరుత్థానమునకును, కీడు చేసిన వారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు (యోహాను 5:28–29). కీడు చేసి, తీర్పు పునరుత్థానములోనికి వెళితే నరక శిక్షకు గురి కావలసివుంటుంది (ప్రకటన 21:8). అయితే మేలు చేసి, జీవ పునరుత్థానములోనికి ప్రవేశించాలంటే యేసుక్రీస్తును దేవుడిగా, రక్షకుడిగా విశ్వసించాలి. యీ మాటల ద్వారా దేవుడు మీతో మాట్లాడు చుండిన యెడల యీ క్రింది ప్రార్థనను హృదయములో చేయుము:

"దేవా! నేను పాపిని, నా పాపముల కొరకు ప్రభువైన యేసుక్రీస్తు మరణించి, సమాధి చేయబడి, తిరిగి లేచాడని నా హృదయములో విశ్వసిస్తున్నాను. నా పాపములను యేసు పరిశుద్ధ రక్తముతో కడుగుము. నన్ను కూడా మీ సంతానములో చేర్చుకొని, మీకు సాక్షిగా జీవించునట్లు జ్ఞానమును అనుగ్రహించుము. యేసుక్రీస్తు పరిశుద్ధ నామమున ప్రార్థిస్తున్నాను తండ్రీ! ఆమెన్!"

"కుమారుని (యేసుక్రీస్తును) చూచి, ఆయనయందు విశ్వాసముంచు ప్రతివాడును నిత్యజీవము పొందుటయే నా తండ్రి చిత్తము. అంత్య దినమున నేను వానిని లేపుదును" (యోహాను 6:40).

# 4. వారముల పండుగ (పెంతెకొస్తు పండుగ)
## (Feast of Weeks)

"మీరు విశ్రాంతి దినమునకు మరునాడు మొదలుకొని, అనగా అల్లాడించు పనను మీరు తెచ్చిన దినము మొదలుకొని యేడు వారములు లెక్కింపవలెను. లెక్కకు తక్కువ కాకుండా ఏడు వారములు వుండవలెను. ఏడవ విశ్రాంతి దినపు మరు దినము వరకు మీరు ఏబది దినములు లెక్కించి, యెహోవాకు క్రొత్త ఫలముతో నైవేద్యము అర్పింపవలెను. మీరు మీ నివాసములలో నుండి తూములో రెండేసి పదియవ వంతుల పిండి గల రెండు రొట్టెలను అల్లాడించు అర్పణముగా తేవలెను. వాటిని గోధుమ పిండితో చేసి, పులియబెట్టి, కాల్చవలెను. అవి యెహోవాకు ప్రథమ ఫలముల అర్పణము. మరియు మీరు ఆ రొట్టెలతో నిర్దోషమైన యేడు ఏడాది మగ గొఱ్ఱెపిల్లలను, ఒక కోడె దూడను, రెండు పెద్ద పొట్టేళ్ళను అర్పింపవలెను. అవి వారి నైవేద్యములతోను వారి పానార్పణములతోను దహనబలియై యెహోవాకు యింపైన సువాసన గల హోమమగును. అప్పుడు మీరు మేకలలో ఒక పోతును పాపపరిహారార్థ బలిగా అర్పించి, రెండు ఏడాది గొఱ్ఱెపిల్లలను సమాధాన బలిగా అర్పింపవలెను. యాజకుడు ప్రథమ ఫలముల రొట్టెలతో వాటిని, ఆ రెండు పొట్టేళ్ళను యెహోవా సన్నిధిని అల్లాడింపవలెను. అవి యెహోవాకు ప్రతిష్టింపబడినవై, యాజకునివగును. ఆనాడే మీరు పరిశుద్ధ సంఘముగా కూడవలెనని చాటింపవలెను. అందులో మీరు జీవనోపాధియైన యే పనియు చేయకూడదు. ఇది మీ సమస్త నివాసములలో మీ తరతరములకు నిత్యమైన కట్టడ. మీరు మీ పంటచేను కోయునప్పుడు నీ పొలము యొక్క ఓరలను పూర్తిగా కోయకూడదు. నీ కోతలో రాలిన పరిగెను ఏరుకొనకూడదు. బీదలకును, పరదేశులకును వాటిని విడిచి పెట్టవలెను. నేను మీ దేవుడైన యెహోవాను"

(లేవీయ కాండం 23:15-22).

"నీ దేవుడైన యెహోవాకు వారముల పండుగ ఆచరించుటకై నీ చేతనైనంత స్వేచ్ఛార్పణమును సిద్ధపరచవలెను. నీ దేవుడైన యెహోవా నిన్ను ఆశీర్వదించిన కొలది దాని నియ్యవలెను" (ద్వితీయోపదేశ కాండం 16:10).

పై వాక్యభాగమును (లేవీయ కాండం 23:15-22) పరిశీలించిన యెడల ఇశ్రాయేలీయులు 'ప్రథమ ఫలముల' పండుగ ఆచరించిన యేబది (50) దినముల తరువాత 'వారముల' పండుగను ఆచరింపవలెనని ఆజ్ఞాపింపబడిరి (16 వ వచనము). యిది మూడవ నెల (సివన్) ఆరవ తారీఖున ఆచరింపబడుచున్నది. ప్రథమ ఫలముల పండుగ యేసుక్రీస్తు పునరుత్థానమును సూచిస్తున్నదని గత అధ్యాయములో చూచితిమి. ప్రథమ ఫలముల పండుగకు, వారముల పండుగకు 50 దినముల వ్యవధి వున్నట్లే యేసుక్రీస్తు పునరుత్థానమునకు, పరిశుద్ధాత్మ భూమి మీదికి వచ్చి, క్రీస్తు సంఘము స్థాపించబడుటకు 50 దినముల వ్యవధి వున్నది. అనగా వారముల పండుగ పరిశుద్ధాత్మ ఆగమనమును, సంఘ స్థాపనను సూచిస్తున్నది. యిది పెంతెకొస్తు దినమున ఆచరించబడినది గనుక యీ పండుగ 'పెంతెకొస్తు' పండుగ అని కూడా పిలువబడుచున్నది.

యేసుక్రీస్తు పునరుత్థానుడైన తరువాత నలువది దినముల వరకు తన శిష్యులకు అగుపడుచు, దేవుని రాజ్య విషయములను గూర్చి వారికి బోధించుచూ, తన్నుతాను సజీవునిగా వారికి కనపరచుకొని, తాను పరలోకమునకు ఆరోహణమైన తరువాత పరిశుద్ధాత్మ కొరకు కనిపెట్టమని శిష్యులను కోరినట్లు అపొ.కా. 1:3-5 లో వ్రాయబడినది. యేసుక్రీస్తు మాట ప్రకారము నూట ఇరువది మంది శిష్యులు కూడుకొని యున్నప్పుడు పెంతెకొస్తు దినమున పరిశుద్ధాత్మ వారి మీదికి వచ్చి, వారు అన్య భాషలలో మాట్లాడసాగిరి (అపొ.కా.

1:15, 2:1-4). పరిశుద్ధాత్మను గూర్చి యేసుక్రీస్తు తన శిష్యులతో, "నేను తండ్రిని వేడుకొందును. మీ యొద్ద యెల్లప్పుడు వుండుటకై ఆయన వేరొక ఆదరణ కర్తను, అనగా సత్య స్వరూపియగు ఆత్మను మీకనుగ్రహించును. లోకము ఆయనను చూడదు. ఆయనను ఎరుగదు గనుక ఆయనను పొందనేరదు. మీరు ఆయనను యెరుగుదురు. ఆయన మీతో కూడ నివసించును. మీలో వుండును" అని యోహాను 14:16-17లో చేసిన వాగ్దానము పెంతెకొస్తు దినమున నెరవేరినట్లు గమనించగలము.

వారముల పండుగ రోజు రెండు గోధుమ రొట్టెలను ఇశ్రాయేలీయులు అల్లాడించు అర్పణముగా అర్పించిరి (లేవీయ కాండం 23:17). యీ రెండు రొట్టెలు క్రీస్తు సంఘములోని యూదులు మరియు అన్యజనులను సూచించుచున్నవి. "యూదులమైనను, గ్రీసు దేశస్థులమైనను, దాసులమైనను, స్వతంత్రులమైనను మనమందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి. మనమందరము ఒక్క ఆత్మను పానము చేసిన వారమైతిమి" (1 కొరింథీ 12:13) అని వ్రాయబడిన ప్రకారము యూదులు, అన్యజనులు పరిశుద్ధాత్మ ద్వారా క్రీస్తు సంఘములో చేర్చబడిరి. అపొ.కా. 2:1-4లో పరిశుద్ధాత్మ యూదుల మీదికి రాగా, అపొ.కా. 10:44-45, 15:17లో అన్యజనుల మీదికి వచ్చెను. వీరిద్దరి మధ్యవున్న మధ్యగోడను పడగొట్టి, యిద్దరిని క్రీస్తు శరీరములో ఏకము చేసెను (ఎఫెసీ 2:14-16, 3:6).

పైన చెప్పబడిన రెండు గోధుమ రొట్టెలు పులియబెట్ట బడినవని చదువుచున్నాము (లేవీయ కాండం 23:17). పులిసిన పిండి ప్రాచీన స్వభావమును సూచిస్తున్నదని పులియని రొట్టెల పండుగ వర్ణనలో చదివితిమి. తమ పాపములు క్షమింపబడినప్పటికీ, క్రీస్తు సంఘము పాపమునకు అతీతులు

కాని, అసంపూర్ణులైన మానవుల సముదాయమని దీనిని బట్టి తెలుసు కుంటున్నాము (మత్తయి 26:40-43; యాకోబు 1:14; అపొ.కా. 5:1-11).

సివన్ నెల ఆరవ తారీఖున వారముల (పెంతెకొస్తు) పండుగ ఆచరింపబడుతున్నది. కొన్ని సంవత్సరముల క్రిందట దేవుడు ఇశ్రాయేలీ యులకు సినాయి పర్వతము మీద ధర్మశాస్త్రము నిచ్చినప్పుడు ఇదే సివన్ నెల ఆరవ తారీఖున యిచ్చెనని చెప్పుదురు. ధర్మశాస్త్రమును మరియు పెంతెకొస్తు దినమున పంపబడిన పరిశుద్ధాత్మను పోల్చి చూస్తే,

☼ ధర్మశాస్త్రము పాపమనగా యెట్టిదో మనకు తెలియజేసింది (రోమా 3:20). అంతేగాక మనలను పాపులనుగా తీర్చి, మనలను మనము రక్షించుకొనలేమని, రక్షణ కొరకు క్రీస్తు వైపునకు మనలను మళ్ళించింది (గలతి 3:10, 22-24).

పరిశుద్ధాత్మ దేవుడు కూడా పాపమును గూర్చియు, నీతిని గూర్చియు మరియు తీర్పును గూర్చియు లోకమును ఒప్పింపజేసి, మనలను సర్వసత్యములోనికి నడిపింప చేయునని యోహాను 16:8-13లో చదువుచున్నాము. అంతేగాక మనలను రక్షింపజేసి, మనలో నివసించునని (యోహాను 3:3,5; రోమా 8:11), తన శక్తితో మనలను నింపి, పరిచర్యలో వాడుకొనునని (అపొ.కా. 1:8) దేవుని వాక్యము సెలవిస్తున్నది.

☼ ధర్మశాస్త్రము పాత నిబంధనను సూచిస్తుంటే పరిశుద్ధాత్మ దేవుడు కృపద్వారా విశ్వాసముతో కలుగు యేసుక్రీస్తునందున్న రక్షణవైపు (నూతన నిబంధన వైపు) మనలను నడిపిస్తున్నాడు (యిర్మియా 31:31-34).

పెంతెకొస్తు పండుగ (వారముల పండుగ) ద్వారా పరిశుద్ధాత్మ దేవుని ప్రాముఖ్యతను పైన చెప్పబడినట్లు గ్రహించుచున్నాము.

# 5. బూరల పండుగ
## (Feast of Trumpets)

"మరియు యెహోవా మోషేకు ఈలాగు సెలవిచ్చెను. నీవు ఇశ్రాయేలీయులతో యిట్లనుము. ఏడవ నెలలో మొదటి దినము మీకు విశ్రాంతి దినము. అందులో జ్ఞాపకార్థ శృంగధ్వని వినినప్పుడు మీరు పరిశుద్ధ సంఘముగా కూడవలెను. అందులో మీరు జీవనోపాధియైన ఏ పనియు చేయుటమాని యెహోవాకు హోమము చేయవలెను" (లేవీయ కాండం 23:23-25).

పై వాక్యభాగములో శృంగధ్వని వినినప్పుడు ఇశ్రాయేలీయులు పరిశుద్ధ సంఘముగా కూడి, యెహోవాకు హోమము చేయవలెనని వ్రాయబడినది. శృంగధ్వని అనగా బూరల ధ్వని. వారముల పండుగ (పెంతొకొస్తు పండుగ) ఆచరించిన మూడు నెలల తరువాత ఏడవ నెల (టిశ్రె) మొదటి దినమున బూరల పండుగ ఆచరింపబడుతున్నది. పెంతెకొస్తు పండుగ సంఘస్థాపనను సూచిస్తున్నది గనుక యీ మూడు నెలల వ్యవధి సంఘకాలమును సూచిస్తున్నది. శరత్ కాలమున (Fall) ఇశ్రాయేలీయులు ఆచరించు మూడు పండుగులలో బూరల పండుగ మొట్టమొదటిది.

దేవుని వాక్యములో బూరల పండుగ ఎంతో ప్రాముఖ్యమైనది. సంఖ్యా కాండం 10:1-2లో దేవుడు మోషేతో రెండు వెండి బూరలు నకిషి పనిగా చేయించుకొనమని చెప్పాడు. వీటిని క్రింద తెలుపబడిన సందర్భములలో ఊదవలెనని ఆ యా వచనములలో చదువుదుము.

1) సమాజము కూడి వచ్చుటకు (సంఖ్యా కాండం 10:3; నిర్గమ కాండం 19:13)

2) సమాజము ముందుకు ప్రయాణమై సాగుటకు (సంఖ్యా కాండం 10:2,5,6)

3) శత్రువులతో యుద్ధము చేయుటకు (సంఖ్యా కాండం 10:9) ఇశ్రాయేలీయులు యెరికోను చుట్టిముట్టి, బూరలను ఊదుటను బట్టి యెరికో గోడలు కూలెనని యెహోషువ 6:1-27లో వ్రాయబడినది.

4) పండుగ దినములను ప్రకటించుటకు, బలులు అర్పించుటకు (సంఖ్యా కాండం 10:10; లేవీయ కాండం 25:9)

సినాయి పర్వతము మీద దేవుడు తనను తాను ఇశ్రాయేలీయులకు బయలు పరచుకొని, వారికి పది ఆజ్ఞలిచ్చినప్పుడు బూరధ్వని మ్రోగెనని నిర్గమ కాండం 19:16, 18, 19 లలో చదువుచున్నాము. అపొస్తలుడైన యోహాను పత్మాసు ద్వీపములో దేవుడు తనకు బయలు పరచిన దర్శనములో తాను విన్న స్వరము బూరధ్వని వలె వుండెనని చెప్పాడు (ప్రకటన 1:10, 4:1). ఏడేండ్ల శ్రమల కాలములో యేడుగురు దేవదూతలు తమ బూరలను ఊదుట ద్వారా దేవుని తీర్పు భూమి మీదికి వచ్చునని ప్రకటన 8,9,10 అధ్యాయములలో వ్రాయ బడినది.

పాత నిబంధనలో ఇశ్రాయేలీయులు జరుపుకొన్న బూరల పండుగ ప్రస్తుత దినములలో వున్న మనకు యీ క్రింది సంగతులను సూచిస్తున్నది:

1) దేవుని వాక్యములో ఉన్న పాత నిబంధన మరియు క్రొత్త నిబంధనలు రెండు బూరలవలె వున్నవి. ఈ రెండు బూరలు కూడా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా మానవులు పాప విమోచన పొంది, దేవుని రాజ్యములో చేర్చబడాలని చాటి చెప్పుచున్నవి. యేసుక్రీస్తు తన పరిచర్య మొదలు పెట్టినప్పుడు, "కాలము సంపూర్ణమైయున్నది. దేవుని రాజ్యము సమీపించి యున్నది. మారుమనస్సు పొంది, సువార్త నమ్ముడని" చెప్పుచు, దేవుని సువార్త ప్రకటించుచు, గలిలయకు వచ్చెనని మార్కు 1:14-15లో వ్రాయబడినది. రక్షణ పొందిన మనము సర్వలోకమునకు వెళ్ళి, సర్వసృష్టికి సువార్తను (దేవుని బూరను) ప్రకటించుమని

ఆజ్ఞాపించబడితిమి (మార్కు 16:15). అంతేగాక, దేవుని వాక్యమను బూరల ద్వారా మన జీవితములు మన కొరకు కాకుండా, మన కొరకు మృతిపొంది, తిరిగి లేచిన యేసుక్రీస్తు కొరకే జీవించవలెనని హెచ్చరింపబడుచున్నాము (1కొరింథీ 6:20; 2కొరింథీ 5:15).

2) బూరల పండుగ సంఘము ఎత్తబడుటను సూచిస్తున్నది. పాత నిబంధనలో దేవుడు ఇశ్రాయేలీయులకు బూరధ్వని మధ్య కారు మబ్బులలో సినాయి పర్వతము మీద ప్రత్యక్షపరచుకున్నాడు (నిర్గమ కాండం 19:9–16). అదే విధానములో "ఆర్భాటముతోను, ప్రధాన దూత శబ్దముతోను, దేవుని **బూర**తోను పరలోకమునుండి ప్రభువు దిగివచ్చును. క్రీస్తునందు మృతులైన వారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితో కూడా ఏకముగా ప్రభువును యెదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘముల మీద కొనిపోబడుదుము. కాగా మనము సదా కాలము ప్రభువుతో కూడ ఉందుము. కాబట్టి మీరు యీ మాటల చేత ఒకనినొకడు ఆదరించు కొనుడని" 1థెస్సలొనీకయులకు 4:13–18లో చదువుచున్నాము. యిదే అర్థము నిస్తూ 1కొరింథీ 15:51–52లో, "ఇదిగో మీకు ఒక మర్మము తెలుపుచున్నాను. మనమందరము నిద్రించముగాని, ఒక రెప్ప పాటున, కడబూర మ్రోగగానే మనమందరము మార్పు పొందుదుము. బూర మ్రోగును. అప్పుడు మృతులు అక్షయులుగా లేపబడుదురు. మనము మార్పు పొందు దుము" అని వ్రాయబడినది.

3) చివరిగా బూరల పండుగ చెదరి పోయిన ఇశ్రాయేలీయులు సమకూర్చ బడుటయను సత్యమును సూచిస్తున్నది. క్రీస్తు శకము 70లో రోమన్ చక్రవర్తి టైటస్ యెరూషలేమును మరియు అందలి దేవుని మందిరమును నాశనము చేసి, యూదులను బందీలుగా తీసుకెళ్ళాడు. అప్పటి నుండి యూదులు తమ

దేశమును కోల్పోయి, ప్రపంచ నలుమూలలా చెదిరిపోయిరి. అయితే, దేవుని వాక్యములో దేవుడు యూదులను తిరిగి తమ దేశమునకు రప్పిస్తానని అనేక ప్రవచనముల ద్వారా తెలియజేశాడు. ఉదాహరణకు యెహెజ్కేలు 37:21–22లో, "ఇట్లుండగా వారి కీలాగు చెప్పుము. ప్రభువైన యెహోవా సెలవిచ్చునదేమనగా – ఏ యే అన్యజనులలో ఇశ్రాయేలీయులు చెదరిపోయిరో ఆ యా అన్యజనులలో నుండి వారిని రక్షించి, వారు ఎచ్చటెచ్చట ఉన్నారో అచ్చట నుండి వారిని సమకూర్చి, వారి స్వదేశములోనికి తోడుకొని వచ్చి, వారిక మీదట యెన్నటికిని రెండు జనములు గాను, రెండు రాజ్యములు గాను ఉండకుండునట్లు ఆ దేశములో ఇశ్రాయేలీయుల పర్వతముల మీద వారిని ఏక జనముగా చేసి, వారికందరికీ ఒక రాజునే నియమించెదను" అన్న ప్రవచనమును గూర్చి చదువుచున్నాము. అంతేగాక యెషయా 11:11–12, 27:13, 43:5,6; ఆమోసు 9:14–15; యిర్మీయా 16:14–15, 31:10; ద్వితీయోపదేశ కాండం 30:3–5; జెకర్యా 8:7–8; యెహెజ్కేలు 34:13, 36:8–12,24 వాక్య భాగములలో దేవుడు చెదరిపోయిన యూదులను తిరిగి తమ దేశమునకు రప్పించుచున్న ప్రవచనములను గూర్చి చదివెదము.

దేవుని వాక్య ప్రకారమే 1948 మే నెల 14వ తేదీన యూదులు ఇశ్రాయేలు దేశములో సమకూర్చబడిరి. దీనికి సూచనగా దేవుడు యెహెజ్కేలుకు 'యెండిన యెముకల లోయ'ను గూర్చిన దర్శనమును కలుగజేశాడు (యెహెజ్కేలు 37:1–14). ఈ దర్శనము రెండు భాగములుగా ఉన్నది. మొదటి భాగములో యెండిన ఎముకలు అతకబడి, మాంసము, చర్మముతో కప్పబడి, శరీరములుగా మారబడినవి (యెహెజ్కేలు 37:1–8). అయితే వాటిలో జీవాత్మ లేదు. అనగా ప్రస్తుతము ఇశ్రాయేలులో వున్న అనేక యూదులు యేసుక్రీస్తును

తృణీకరిస్తున్నారు. వారు దేవుని యెరుగలేదు. అయితే దర్శనము యొక్క రెండవ భాగములో యెహెజ్కేలు జీవాత్మను రప్పించమని దేవుని ప్రార్థించగా వారు సజీవులై, లెక్కింప శక్యము కాని మహా సైన్యమై నిలిచారు (యెహెజ్కేలు 37:9-10, 13-14). అనగా సంఘము పైకెత్తబడి, భూమి మీద ఏడేండ్ల శ్రమలకాలము ముగిసిన తరువాత యేసుక్రీస్తు ఒలీవ కొండ మీదికి దిగివచ్చి, తన సైన్యముతో అంత్య క్రీస్తుతో యుద్ధము చేసి, యూదులను రక్షించును (జెకర్యా 14:1-4). అప్పుడు వారు యేసుక్రీస్తును తమ రక్షకునిగా కలిగియుందురు (జెకర్యా 12).

పైన చెప్పబడిన విధానములో బూరల పండుగ దేవుని వాక్య ప్రకటనను (సాక్ష్యమును), క్రీస్తు సంఘము ఎత్తబడుటను మరియు యూదులు సమకూర్చబడుటను సూచిస్తున్నదని తెలుసుకొందుము.

# 6. ప్రాయశ్చిత్తార్థ దినము
## (The Day of Atonement)

"మరియు యెహోవా మోషేకు యీలాగు సెలవిచ్చెను. యీ యేడవ నెల పదియవ దినము పాపము నిమిత్తమైన ప్రాయశ్చిత్తార్థ దినము. అందులో మీరు పరిశుద్ధ సంఘముగా కూడవలెను. మిమ్మును మీరు దు:ఖపరచుకొని, యెహోవాకు  హోమము చేయవలెను. ఆ దినమున మీరు యే పనియు చేయకూడదు. మీ దేవుడైన యెహోవా సన్నిధిని మీరు మీ నిమిత్తము ప్రాయశ్చిత్తము చేసికొనుటకై అది ప్రాయశ్చిత్తార్థ దినము. ఆ దినమున తన్నుతాను దు:ఖపరచుకొనని ప్రతివాడు తన ప్రజలలో నుండి కొట్టివేయబడును. ఆ దినమున యే పనియైనను చేయు ప్రతివానిని వాని ప్రజలలో నుండకుండ నాశనము చేసెదను. అందులో మీరు యే పనియు చేయకూడదు. అది మీ సమస్త నివాసములలో మీ తరతరములకు నిత్యమైన కట్టడ. అది మీకు మహా విశ్రాంతి దినము. మిమ్మును మీరు దు:ఖపరచు కొనవలెను. ఆ నెల తొమ్మిదవ నాటి సాయంకాలము మొదలుకొని మరుసటి సాయంకాలము వరకు మీరు విశ్రాంతి దినముగా ఆచరింపవలెను" (లేవీయ కాండము 23:26-32).

"మరియు అతడు ఇశ్రాయేలీయుల సమాజము నొద్దనుండి పాప పరిహారార్థ బలిగా రెండు మేక పిల్లలను దహన బలిగా ఒక పొట్టేలును తీసుకొని రావలెను. అహరోను తన కొరకు పాపపరిహారార్థ బలిగా ఒక కోడెను అర్పించి, తన నిమిత్తమును, తన యింటి వారి నిమిత్తమును ప్రాయశ్చిత్తము చేసి, ఆ రెండు మేక పిల్లలను తీసుకొని వచ్చి, ప్రత్యక్షపు గుడారము యొక్క ద్వారము యొద్ద యెహోవా సన్నిధిని వాటిని ఉంచవలెను. అప్పుడు అహరోను యెహోవా పేరిట ఒక చీటిని, విడిచి పెట్టే మేక పేరిట ఒక చీటిని ఆ రెండు మేకల మీద రెండు

చీట్లను వేయవలెను. ఏ మేక మీద యెహోవా పేరిట చీటి పడునో, ఆ మేకను అహరోను తీసుకొని వచ్చి, పాపపరిహారార్థబలిగా అర్పింపవలెను. ఏ మేక మీద విడిచి పెట్టుట అనే చీటి పడునో దాని వలన ప్రాయశ్చిత్తము కలుగునట్లు దానిని అరణ్యములో విడిచి పెట్టుటకై యెహోవా సన్నిధిని దానిని ప్రాణముతోనే వుంచవలెను" (లేవీయ కాండం 16:5-11).

"అతడు పరిశుద్ధ స్థలమునకును, ప్రత్యక్షపు గుడారమునకును, బలి పీఠమునకును ప్రాయశ్చిత్తము చేసి, చాలించిన తరువాత ఆ సజీవమైన మేకను దగ్గరకు తీసుకొని రావలెను. అప్పుడు అహరోను సజీవమైన ఆ మేక తల మీద తన రెండు చేతులు వుంచి, ఇశ్రాయేలీయుల పాపములన్నియు, అనగా వారి దోషములన్నియు, వారి అతిక్రమములన్నియు దాని మీద ఒప్పుకొని, ఆ మేక తలమీద వాటిని మోపి, తగిన మనుష్యుని చేత అరణ్యములోనికి దాని పంపవలెను. ఆ మేక వారి దోషములన్నిటిని ఎడారి దేశమునకు భరించిపోవును. అతడు అరణ్యములో ఆ మేకను విడిచి పెట్టవలెను" (లేవీయ కాండం 16:20-22).

ఇశ్రాయేలీయులు యేడవ నెల మొదటి దినమున బూరల పండుగ జరుపుకొన్న తరువాత పదియవ దినమున ప్రాయశ్చిత్తార్థ దినమును ఆచరించిరి. అనగా ఈ దినమందు వారు తమ పాపముల నిమిత్తమై ప్రాయ శ్చిత్తమును (లేదా పాపనివృత్తి, పాపపరిహారమును) చేసుకొనిరి. ప్రాయ శ్చిత్తార్థ దినము ఇశ్రాయేలీయులకు ఎంతో ప్రాముఖ్యమైనదిగా లేవీయకాండం 16వ అధ్యాయము ద్వారా మనము గమనించగలము.

యీ అధ్యాయమును ధ్యానించినట్లయితే, ప్రధాన యాజకుడైన అహరోను ఇశ్రాయేలీయుల పాపముల కొరకు చేసిన ప్రాయశ్చిత్తము ప్రభువైన యేసుక్రీస్తు ప్రధాన యాజకుడిగా మానవులందరి కొరకు సిలువలో జరిగించిన

రక్షణకార్యమునకు సూచక ప్రాయంగా వున్నదని క్రింద తెలుపబడినట్లు గమనించుదుము.

✳ ప్రధాన యాజకుడైన అహరోను నీటితో స్నానము చేసుకొని, సన్ననారతో చేసిన తన యాజక వస్త్రములను ధరించుచున్నాడు (4వ వచనము). సన్ననార పరిశుద్ధతను సూచిస్తున్నది. ప్రభువైన యేసుక్రీస్తు పాపము లేని పరిశుద్ధుడు (హెబ్రీ 7:26).

✳ ప్రధాన యాజకుడైన అహరోను తన యొక్క, తన యింటి వారి యొక్క పాపములను బట్టి ఒక కోడెను బలిగా అర్పించి, ప్రాయశ్చిత్తము చేసుకొనుచున్నాడు (6వ వచనము). యేసుక్రీస్తు పాపములేని పరిశుద్ధుడు గనుక తన కొరకు యెలాంటి ప్రాయశ్చిత్తము చేసుకోనవసరము లేదు.

✳ అహరోను ఇశ్రాయేలీయుల సమాజము యొద్దనుండి పాప పరిహారార్థ బలిగా రెండు మేకలను తీసుకొని, వాటి మీద చీట్లువేసి, యెహోవా పేరిట బలిగా అర్పించబడు మేకను, పాపములను భరిస్తూ అరణ్యములో విడిచి పెట్టబడు మేకను వేరుచేశాడు. తరువాత యెహోవా పేరిట బలిగా అర్పింపబడు మేకను వధించి, దాని రక్తముతో ప్రత్యక్షపు గుడారము యొక్క అతి పరిశుద్ధ స్థలములో ప్రవేశించి, దేవుని మందసము పైవున్న కరుణా పీఠము మీద ప్రోక్షించి, ఇశ్రాయేలీయుల సమస్త పాపములను బట్టియు, అపవిత్రతను బట్టియు, అతిక్రమములను బట్టియు ప్రాయశ్చిత్తము చేశాడు. తరువాత అతి పరిశుద్ధ స్థలము నుండి వెలుపలికి వచ్చి, సజీవంగా వున్న ఆ రెండవ మేక మీద తన రెండు చేతులుంచి, ఇశ్రాయేలీయుల పాపములు, దోషములు, అతిక్రమములు దాని మీద ఒప్పుకొని, ఆ మేక తలమీద వాటిని మోపి, అరణ్యములోనికి దానిని పంపించాడు (లేవీయ కాండం 16:9-22).

యీ మాటలు ప్రభువైన యేసుక్రీస్తు మన కొరకు చేసిన రక్షణ కార్యములో

వున్న రెండంతల సత్యమును సూచిస్తున్నవి. మొదటి మేక బలిగా అర్పింప బడకుండా రెండవ మేక అరణ్యములో విడిచి పెట్టబడదు. అనగా రక్త ప్రోక్షణ లేకుండా పాప క్షమాపణ లేదు (హెబ్రీ 9:22). మొదటి మేక బలిగా అర్పింపబడి, దాని రక్తము ద్వారా ఇశ్రాయేలీయుల పాపములకు ప్రాయశ్చిత్తము జరిగించ బడినట్లు, తన్నుతాను బలిగా అర్పించుకొని, తన స్వరక్తముతో యేసుక్రీస్తు మానవుల పాపముల ప్రాయశ్చిత్తము జరిగించాడు ( లేవీయ కాండం 17:11; హెబ్రీ 9:24-28; రోమా 3:26).

యేసుక్రీస్తు జరిగించిన యీ బలియందు విశ్వాసముంచినచో మన పాపములకు ప్రాయశ్చిత్తము పొందుదుము (రోమా 5:11; 1యోహాను 1:7; 1పేతురు 1:18-19). తద్వారా మనము ధైర్యముతో దేవుని సన్నిధిలో ప్రవేశించుటకు యోగ్యత కలిగియుందుము (హెబ్రీ 4:16, 10:22). తాను చిందించిన రక్తమును బట్టి రెండవ మేకవలె మన పాపములను తనపై మోసికొని, మన నుండి వాటిని దూరపరిచాడు. బాప్తిస్మమిచ్చు యోహాను యేసుని చూచి, “ఇదిగో లోక పాపమును మోసికొని పోవు దేవుని గొఱ్ఱెపిల్ల” అని సాక్ష్యమిచ్చాడు (యోహాను 1:29). “మన పాపముల విషయమై చనిపోయి, నీతి విషయమై జీవించునట్లు, ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసికొనెను. ఆయన పొందిన గాయముల చేత మీరు స్వస్థత పొందిరి” అని 1 పేతురు 2:24లో దేవుని వాక్యము సెలవిస్తున్నది. “పడమటికి తూర్పుకు ఎంత దూరమో ఆయన మన అతిక్రమములను మనకు అంత దూరపరచి యున్నాడని” దేవుని క్షమాపణ గురించి కీర్తన 103:12లో చదివెదము. పాపమెరుగని ప్రభువు మన కొరకు పాపముగా చేయబడి (2కొరింథీ 5:21), మనందరి దోషములు ఆయన మీద మోపబడి (యెషయా 53:6), మన స్థానములో తాను శిక్షపొందుట ద్వారా (యెషయా 53:4)

మనకు పాపనివారణ కలిగినదని తెలుసు కొందుము. యూదుల ఆచార ప్రకారము బలిగా అర్పింపబడబోవు మేక మెడకు మరియు విడిచి పెట్టబడబోవు మేక కొమ్మునకు ఎర్రని గుడ్డను గుర్తుగా కట్టెడివారు. దేవుని వాక్యములో సైనికులు ప్రభువైన యేసుక్రీస్తు వస్త్రములు తీసివేసి, ఆయనకు ఎర్రని అంగీని తొడిగించిరని చదువుచున్నాము (మత్తయి 27:28). యీ మాట ప్రభువు మన పాపములకు బలియాయెనన్న సత్యమును సూచిస్తున్నది.

✳ అహరోను ఇశ్రాయేలీయుల పాపముల నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయుటకు ప్రత్యక్షపు గుడారములో ప్రవేశించి, బయటకు వచ్చు వరకు ఏ మనుష్యుడును అందులో ప్రవేశింపకూడదు (లేవీయ కాండం 16:17). ప్రభువైన యేసుక్రీస్తు ఒంటరిగానే మన కొరకు శ్రమపడ్డాడు (యెషయా 53). లోక పాపము సిలువలో తన మీద మోసికొని, నా దేవా, నాదేవా నన్నెందుకు చెయ్యి విడిచితివని తండ్రి నుండి యెడబాటును సహించాడు (మత్తయి 27:46).

✳ ఇశ్రాయేలీయులు ప్రాయశ్చిత్తార్థ దినమందు తమ్మును తాము దు:ఖపరచుకొనిరి (లేవీయ కాండం 16:29, 23:27). అనగా వారు ఉపవాసములోను, ప్రార్థనలోను, పాపమును గూర్చిన పశ్చాత్తాపముతోను, క్షమాపణ కోరే హృదయములతోను తమను తామే ప్రాయశ్చిత్తార్థ దినము కొరకు సిద్ధపరచుకొనిరి. దేవుని వాక్యము 2 కొరింథీ 7:10లో “దైవ చిత్తానుసారమైన దు:ఖము రక్షణార్థమైన మారుమనస్సును కలుగజేయును” అని సెలవిస్తున్నది. ప్రస్తుత కాలములో వున్న మనము వాక్యపు వెలుగులో స్వయం పరిశోధన చేసికొని, పాప క్షమాపణ పొందవలెనని వాక్యము ద్వారా హెచ్చరింపబడుచున్నాము (1కొరింథీ 11:28-32; కీర్తన 139:23-24).

✳ ఇశ్రాయేలీయులు ప్రాయశ్చిత్తార్థ దినమును తమ భాషలో “యామ్ కిప్పూర్” అని పిలుస్తారు. యామ్ అనగా దినము. కిప్పూర్ అనగా కప్పబడుట.

ఇశ్రాయేలీయులు తాము అర్పించు బలులను బట్టి వారి పాపములు కప్పబడుచుండెను గాని సంపూర్ణముగా తీసివేయబడలేదు. అందుకే అహరోను ప్రతి సంవత్సరము ఇశ్రాయేలీయుల పాపములకు ప్రాయశ్చిత్తము చేయవలసి వచ్చుచుండెను. అయితే యేసుక్రీస్తు రెండవ సారి ప్రత్యక్షమైనప్పుడు క్రింద తెలిపినట్లు వారి పాపములు పూర్తిగా తొలగిపోవును.

ప్రాయశ్చిత్తార్థ దినము యేసుక్రీస్తు రెండవ రాకడను సూచిస్తున్నది. ఇశ్రాయేలీయులు యేసుక్రీస్తును రక్షకుడిగా అంగీకరించక, ఆయనను తృణీకరిస్తూ వచ్చారు (యోహాను 1:11). వారు ఆయనను తెలుసుకొనకుండ వారి హృదయములకు ముసుకు వేయబడినది (2 కొరింథీ 3:14–16). "యెరూషలేమా, యెరూషలేమా, ప్రవక్తలను చంపుచును, నీ యొద్దకు పంపబడిన వారిని రాళ్ళతో కొట్టుచును ఉండుదానా, కోడి తన పిల్లలను రెక్కల క్రిందికేలాగు చేర్చుకొనునో ఆలాగే నేనును నీ పిల్లలను ఎన్నో మారులు చేర్చుకొనవలెనని యుంటిని గాని మీరు ఒల్లక పోతిరి" అని యేసుక్రీస్తు ఇశ్రాయేలీయులను గూర్చి అంగలార్చెనని మత్తయి 23:37లో చదువు చున్నాము. అంతేగాక, "ప్రభువు పేరిట వచ్చువాడు స్తుతింపబడును గాక అని మీరు చెప్పువరకు మీరు నన్ను చూడరని మీతో చెప్పుచున్నానని" ఆనాటి యూదులతో ఆయన చెప్పినట్లు మత్తయి 23:39లో వ్రాయబడినది. ఇశ్రాయేలీయులు యేసుక్రీస్తును తృణీకరిస్తున్న యీ సంఘ కాలములో దేవుడు తన రక్షణను అన్యజనులకు అనుగ్రహిస్తున్నాడు (రోమా 11:25).

అయితే, 'అన్నిటికి కుదురుబాటు కాలములు వచ్చును. అంత వరకు యేసు పరలోకవాసియై వుండుట అవశ్యము' (అపొ.కా. 3:21) అని చెప్పబడిన ప్రకారము ప్రభువైన యేసుక్రీస్తు తన రాకడను ఆలస్యము చేయుచున్నాడు. తన యుక్త కాలమున ఆయన వచ్చినప్పుడు "ఇదిగో ఆయన మేఘారూఢుడై

వచ్చు చున్నాడు. ప్రతి నేత్రము ఆయనను చూచును. ఆయనను పొడిచిన వారును చూచెదరు. భూజనులందరు ఆయనను చూచి రొమ్ము కొట్టు కొందురని" ప్రకటన 1:7లో చదువుదుము. యీ ప్రకారము ఆయన ఒలీవ కొండ మీద తన పాదములుంచును (జెకర్యా 14:4). ఇశ్రాయేలీయుల మీద కరుణ నొందించు ఆత్మను, విజ్ఞాపన చేయు ఆత్మను ఆయన కుమ్మ రింపగా వారు ప్రభువైన యేసుక్రీస్తును తమ రక్షకునిగా యెరుగుదురు (జెకర్యా 12:9-14; రోమా 11:26-27). ఇశ్రాయేలు యింటి వారితో నిబంధన చేసి, వారి పాపములను యిక ఎన్నడును జ్ఞాపకము చేసికొననని ప్రభువు సెలవిచ్చుచున్నాడు (హెబ్రీ 8:8-12).

అహరోను అతి పరిశుద్ధ స్థలము నుండి బయటకు వచ్చి, సజీవమైన మేక మీద తన చేతులుంచి, ఇశ్రాయేలీయుల దోషములను ఆ మేక తలమీద మోపి, దానిని అరణ్యమునకు పంపివేసెనను మాట యేసుక్రీస్తు రక్షణకార్యములో పాపక్షమాపణను సూచిస్తున్నదని యిది వరకు గమనించాము. అయితే, యీ మాటను ఇశ్రాయేలీయులకు వర్తింప జేస్తే, అహరోను అతి పరిశుద్ధ స్థలములో నుండి బయటకు వచ్చి, సజీవమైన మేకమీద తన చేతులుంచి, ఇశ్రాయేలీయుల దోషములను తొలగించిన రీతిలో, యేసుక్రీస్తు పరలోకము నుండి తన రెండవ రాకడలో ఒలీవ పర్వతము మీద ప్రత్యక్షమైనపుడు ఇశ్రాయేలీయుల పాపములను క్షమించి, వారిని రక్షించునని పైన తెలిపిన విధంగా గమనించగలము.

# 7. పర్ణశాలల పండుగ
## (Feast of  Tabernacles)

“మరియు యెహోవా మోషేకు యీలాగు సెలవిచ్చెను. నీవు ఇశ్రాయేలీయులతో యిట్లనుము. ఈ యేడవ నెల పదునయిదవ దినము మొదలుకొని యేడు దినముల వరకు యెహోవాకు పర్ణశాలల పండుగను జరుపవలెను. వాటిలో మొదటి దినమున మీరు పరిశుద్ధ సంఘముగా కూడవలెను. అందులో మీరు జీవనోపాధియైన యే పనియు చేయకూడదు. ఏడు దినములు మీరు యెహోవాకు హోమము చేయవలెను. ఎనిమిదవ దినమున మీరు పరిశుద్ధ సంఘముగా కూడి, యెహోవాకు హోమార్పణము చేయవలెను. అది మీకు వ్రత దినముగా వుండును. అందులో మీరు జీవనోపాధియైన యే పనియు చేయకూడదు. యెహోవా నియమించిన విశ్రాంతి దినములు గాకయు, మీరు దానములనిచ్చు దినములు గాకయు, మీ మ్రొక్కుబడి దినములు గాకయు, మీరు యెహోవాకు స్వేచ్ఛార్పణములనిచ్చు దినములు గాకయు, యెహోవాకు హోమద్రవ్యము నేమి, దహన బలి ద్రవ్యము నేమి, నైవేద్యమునేమి, బలినేమి, పానీయార్పణములనేమి అర్పించుటకై, పరిశుద్ధ సంఘపు దినములుగా మీరు చాటింపవలసిన యెహోవా నియామక కాలములు ఇవి. ఏ అర్పణ దినమున ఆ అర్పణమును తీసుకొని రావలెను. అయితే, యేడవ నెల పదునయిదవ దినమున మీరు భూమి పంటను కూర్చుకొనగా ఏడు దినములు యెహోవాకు  పండుగ ఆచరింపవలెను. మొదటి దినము విశ్రాంతి దినము. ఎనిమిదవ దినము విశ్రాంతి దినము. మొదటి దినమున మీరు దబ్బపండ్లను, ఈత మట్టలను, గొంజి చెట్ల కొమ్మలను, కాలువల యొద్దనుండు నిరవంజి చెట్లను పట్టుకొని యేడు దినములు మీ దేవుడైన యెహోవా సన్నిధిని ఉత్సహించు చుండవలెను. అట్లు మీరు ఏటేట ఏడు దినములు యెహోవాకు

పండుగగా ఆచరింపవలెను. ఇది మీ తరతరములలో నిత్యమైన కట్టడ. ఏడవ నెలలో దానిని ఆచరింపవలెను. నేను ఐగుప్తు దేశములో నుండి ఇశ్రాయేలీయులను రప్పించినప్పుడు వారిని పర్ణశాలలలో నివసింపజేసితినని మీ జనులు యెరుగునట్లు ఏడు దినములు మీరు పర్ణశాలలలో నివసింపవలెను. ఇశ్రాయేలీయులలో పుట్టిన వారందరు పర్ణశాలలలో నివసింపవలెను. నేను మీ దేవుడనైన యెహోవాను. అట్లు మోషే ఇశ్రాయేలీయులకు యెహోవా నియామక కాలములను తెలియజెప్పెను" (లేవీయ కాండం 23:33-44).

యింత వరకు మనము ఇశ్రాయేలీయులు జరుపుకొను ఆరు పండుగలను గురించి తెలుసుకున్నాము. పస్కాపండుగ క్రీస్తు మరణము, తద్వారా కలుగు మానవుల రక్షణ గురించి తెలుపుతున్నది. విశ్వాసులు రక్షింపబడినప్పుడు వారి ప్రాచీన స్వభావము క్రీస్తుతో కూడా సిలువ వేయబడినది గనుక పస్కా పండుగ విశ్వాసి మరణమును సూచిస్తున్నది. పులియని రొట్టెల పండుగ విశ్వాసుల సమాధి జీవితము గురించి, అనగా ప్రాచీన స్వభావము పాతి పెట్టబడి, నవీన స్వభావము, ప్రత్యేకించబడిన జీవితము కలిగి యుండుటను గురించి తెలియజేయుచున్నది. ప్రథమ ఫలముల పండుగ ద్వారా క్రీస్తు పునరుత్థానము, తద్వారా కలుగు విశ్వాసుల పునరుత్థానమును గూర్చి తెలుసుకొంటిమి. వారముల పండుగ ద్వారా పరిశుద్ధాత్మ ఆగమనము మరియు సంఘము స్థాపించబడడము గురించి చూచితిమి. బూరల పండుగ ఇశ్రాయేలీయులు తమ దేశములోనికి సమకూర్చబడుటను మరియు విశ్వాసులు పైకెత్తబడుటను సూచిస్తుండగా, ప్రాయశ్చిత్తార్థ దినము యేసుక్రీస్తు రెండవ రాకడ, ఇశ్రాయేలీయులందరూ రక్షింపబడుటను గూర్చి తెలుపుచున్నదని చూచితిమి. యీ ఆరు పండుగల ఆనందమును పరిపూర్ణము చేయుటకు దేవుడు ఇశ్రాయేలీయులకు ఏడవది, చివరిదైన పర్ణశాలల పండుగను

ఆచరించమని ఆజ్ఞాపించాడు. "నీ కళ్ళములో నుండి ధాన్యమును, నీ తొట్టిలో నుండి రసమును సమకూర్చినప్పుడు పర్ణశాలల పండుగను ఏడు దినములు ఆచరింపవలెను. ఈ పండుగలో నీవును, నీ కుమారుడును, నీ కుమార్తెయును, నీ దాసుడును, నీ దాసియును నీ గ్రామములలో నున్న లేవీయులును, పరదేశులును, తలిదండ్రులు లేని వారును, విధవ రాండ్రును సంతోషింపవలెను" (ద్వితీయోపదేశ కాండం 16:13,14). ఎజ్రా, నెహెమ్యాల కాలములో వారు ఇశ్రాయేలీయులతో పర్ణశాలల పండుగను ఆచరింపజేసిరి (నెహెమ్యా 8:14-18). ఈ వాక్యభాగములను (లేవీయ కాండం 23:33-44, ద్వితీయోపదేశ కాండం 16:13,14, నెహెమ్యా 8:14-18) ధ్యానించిన యెడల, పర్ణశాలల పండుగను గూర్చి యీ క్రింది సంగతులు తెలుసుకొందుము:

1) లేవీయ కాండం 23:42లో, "నేను ఐగుప్తు దేశములో నుండి ఇశ్రాయేలీయులను రప్పించినపుడు వారిని పర్ణశాలలలో నివసింపజేసితినని మీ జనులు యెరుగునట్లు ఏడు దినములు మీరు పర్ణశాలలలో నివసింపవలెను" అని దేవుడు మోషేతో సెలవిచ్చాడు. పర్ణశాల ఎంతో తాత్కాలికమైన కట్టడము. అనగా ఇశ్రాయేలీయులు తమ అరణ్య జీవితము తాత్కాలికమైనదని, అరణ్యములో తాము యాత్రికులమనీ గ్రహింపు గలిగి యుండ వలెనని దేవుడు వారిని కోరెను. యీ భూమి మీద జీవించునంత కాలము మనము పరదేశులముగా, యాత్రికులముగా వున్నామని దేవుని వాక్యము సెలవిస్తున్నది (1పేతురు 2:11). అబ్రాహాము 'దేవుడు దేనికి శిల్పియు, నిర్మాణ కుడునై యున్నాడో పునాదులు గల ఆ పట్టణము కొరకు యెదురు చూస్తూ', భూమి మీద పరవాసిగా జీవించెను. ఆయనతో పాటు ఇస్సాకు, యాకోబులు కూడా తాము భూమి మీద పరదేశులముగా, యాత్రికులముగా వున్నామని ఒప్పుకొని,

విశ్వాసము గల వారై మృతిబొందిరి (హెబ్రీ 11:8-10, 13:16). భూమి మీద మన నివాసము (శరీరము) శిథిలమై పోవునని యెరిగి (2కొరింథీ 5:1), యాత్రికులమన్న దృక్పథంతో పై నున్న వాటినే వెదకుచూ (కొలస్సి 3:2) జీవించవలెనని దేవుని వాక్యము ద్వారా మనము హెచ్చరింప బడుచున్నాము.

2) ఇశ్రాయేలీయులు తమ పంటను సమకూర్చుకొన్న తరువాత, ఏడవ నెల పదునయిదవ దినమునుండి ఏడు దినముల పాటు పర్ణశాలల పండుగను ఆచరించిరి (లేవీయ కాండం 23:39; ద్వితీయోపదేశ కాండం 16:13). యీ మాట దేవుడు విశ్వాసుల నందరిని సమకూర్చిన తరువాత అనగా క్రీస్తులో నిద్రించిన విశ్వాసులు, క్రీస్తు రాకడలో పైకెత్తబడిన విశ్వాసులు, ఏడేండ్ల శ్రమల కాలములో రక్షింపబడిన ఇశ్రాయేలీయులు, యితరులందరిని సమకూర్చి, యేసుక్రీస్తు రాజుగా భూమి మీద నెలకొల్పే వెయ్యేండ్ల పరిపాలనను సూచిస్తున్నది (ప్రకటన 19:14, 20:1-6; జెకర్యా 14:16-19; అపొ.కా. 15:13-17).

3) పర్ణశాలల పండుగ విశ్రాంతి దినమున మొదలై, మరుసటి విశ్రాంతి దినము వరకు కొనసాగుచున్నది (లేవీయకాండం 23:39). యీ మాట నిత్యత్వమును మరియు దేవుని సన్నిధిలో మనము అనుభవించు విశ్రాంతిని సూచిస్తున్నది (మత్తయి 11:28; హెబ్రీ 4:6-13).

4) పర్ణశాలల పండుగ గొప్ప సంతోషముతో ముడిపడి యున్నది. ఇశ్రాయేలీయులు ఆ పండుగను సంతోషముతో జరుపుకొనిరి (లేవీయ కాండం 23:40; ద్వితీయోపదేశ కాండం 16:14; నెహెమ్యా 8:17). యూదుల ఆచార ప్రకారము పర్ణశాలల పండుగ చివరి దినమున వారు సంతోషముతో పాటలు పాడుచూ, సిలోము కోనేటి నుండి ఒక బిందె నీళ్ళు మోసుకొని వచ్చి, దేవుని

మందిరము లోని బలిపీఠము దగ్గర పోసిరి.

అందుకే యేసుక్రీస్తు యీ సంతోషము పొందుట తన ద్వారా మాత్రమే సాధ్యపడునన్న ఉద్దేశ్యముతో యూదులు పర్ణశాలల పండుగ జరుపుకుంటున్న చివరి దినమున, "ఎవడైనను దప్పి గొనిన యెడల నా యొద్దకు వచ్చి, దప్పి తీర్చుకొనవలెను. నా యందు విశ్వాసముంచు వాడెవడో లేఖనము చెప్పినట్లు వాని కడుపులో నుండి జీవజలనదులు పారునని" బిగ్గరగా చెప్పాడు (యోహాను 7:37,38). పర్ణశాలలు తాత్కాలికము. అయితే యేసుక్రీస్తు తన తండ్రి యింట అనేక (శాశ్వత) నివాసములు కలవని, తాను స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నానని, తనతో కూడ వుండుటకు తన శిష్యులను తీసుకు వెళ్ళునని యోహాను 14:1-2లో వాగ్దాన మిచ్చాడు. అంతేగాక, "భూమి మీద మన గుడారమైన యీ నివాసము (శరీరము) శిథిలమై పోయినను, చేతిపని కాక దేవుని చేత కట్టబడినదియు, నిత్యమైనదియునైన నివాసము పరలోకమందు మనకున్నదని యెరుగుదుమని" 2కొరింథీ 5:1లో చదువు చున్నాము. యిదియే నూతన యెరూషలేము. యీ పట్టణము తన భర్త కొరకు అలంకరింపబడిన పెండ్లి కుమార్తె వలె సిద్ధపడి, పరలోకమందున్న దేవుని యొద్ద నుండి దిగివచ్చుట యోహాను చూసి, "ఇదిగో దేవుని నివాసము మనుష్యులతో కూడ వున్నది. ఆయన వారితో కాపుర ముండును. వారాయన ప్రజలైయుందురు. దేవుడు తానే వారి దేవుడైయుండి, వారికి తోడైయుండును" అను గొప్ప స్వరము విన్నాడు (ప్రకటన 21:2-3). దేవుడు మన కిచ్చుచున్న యీ నివాసమును తలపోసికుంటూ మనము చెప్పనశక్యమును, మహిమాయుక్తమునైన సంతోషము గలవారమై, ఆనందించు చున్నాము (1పేతురు 1:8).

5) చివరిగా పర్ణశాలల పండుగలో పర్ణశాలలు కట్టుకొనుటకు ఇశ్రాయేలీయులు ఒలీవ చెట్ల కొమ్మలను, గొంజి చెట్ల కొమ్మలను, ఈత చెట్ల కొమ్మలను,

గుబురు గల వేరువేరు చెట్ల కొమ్మలను, కాలువల యొద్దనుండు నిరవంజి చెట్ల కొమ్మలను తీసుకొని వచ్చిరి (లేవీయ కాండం 23:40; నెహెమ్యా 8:15).

※ ఒలీవ చెట్టు కొమ్మ శాంతి, సమాధానమును సూచిస్తున్నది. క్రీస్తు వెయ్యేండ్ల పాలన శాంతి, సమాధానముతో కూడుకొని యుండును. ఆ దినములలో ప్రజలు తమ ఖడ్గములను నాగటి నక్కులు గాను, తమ యీటెలను మచ్చుకత్తులు గాను సాగ గొట్టుదురు. జనము మీదికి జనము ఖడ్గము ఎత్తక యుండును. యుద్ధము చేయ నేర్చుకొనుట జనులు ఇక మానివేతురు (మీకా 4:1–5). తోడేలు గొఱ్ఱెపిల్ల యొద్ద వాసము చేయును. చిఱుతపులి మేక పిల్లయొద్ద పండుకొనును. దూడయు, కొదమ సింహమును, పెంచబడిన కోడెయు కూడుకొనగా, బాలుడు వాటిని తోలును ......(యెషయా11:6–9).

※ ఈతచెట్టు కొమ్మ (ఖర్జూరపు మట్ట) విజయమునకు గుర్తు. యేసుక్రీస్తు యెరూషలేమునకు వచ్చుచున్నాడని విన్న బహుజన సమూహము ఖర్జూరపు మట్టలు పట్టుకొని, ఆయనను ఎదుర్కొన బోయి, 'జయము, ప్రభువు పేరిట వచ్చుచున్న ఇశ్రాయేలు రాజు స్తుతింపబడును గాక' అని కేకలు వేసిరి (యోహాను 12:13).

※ గుబురుగల చెట్ల కొమ్మలు నీడను అనగా దైవిక సంరక్షణ, కాపుదలను సూచిస్తున్నవి (కీర్తన 91:4).

※ కాలువల యొద్దనుండు నిరవంజి చెట్ల కొమ్మలు ఫలించు జీవితమును సూచిస్తున్నవి (కీర్తన 1:3; యిర్మీయా 17:8).

యిట్లు పర్ణశాలల పండుగ ప్రభువైన యేసుక్రీస్తు యేడేండ్ల శ్రమల కాలపు ముగింపులో యెరూషలేమునకు వచ్చి (జెకర్యా 8:3, 14:4), భూమి మీద నెలకొల్పబోయే వెయ్యేండ్ల పరిపాలనను సూచిస్తున్నది (అపొ.కా. 15:13–17; జెకర్యా 14:16–19; ప్రకటన 20:1–6).